TGTEL/26/A4846

# నవ సంఘర్షణ

తెలుగు దినపత్రిక

www.navasangharshana.com

CEO &chief editor: Medi Naresh

హైదరాబాద్ సంపుటి: 01. సంచిక: 8 శనివారం 8-08-2026 చీఫ్ ఎడిటర్: మేడి నరేష్ పేజీలు-8 వెల :2.00/-

## విషమంగా మొజ్తబా ఖమేనీ ఆరోగ్యం



**జెరూసలేం , ఆగస్టు 7: నవ సంఘర్షణ**
ఇరాన్ అత్యున్నత నేత మొజ్తబా ఖమేనీ ఆరోగ్యం విషమంగా ఉందని, ఆయనను హుటాహుటిన దవాఖానకు తరలించారని ఇజ్రాయెల్ మీడియా సంస్థలు శుక్రవారం వెల్లడించాయి. చానల్ 14 (సీ14), జెరూసలేం పోస్ట్ కథనాల ప్రకారం ఖమేనీ పరిస్థితి అత్యంత విషమంగా ఉంది.ఖమేనీ సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రజల ముందుకు రాలేదు. లిఖితపూర్వక ప్రకటనలతోనే పాలనను సాగిస్తున్నారు. తన తండ్రి నివాసంపై జరిగిన దాడుల్లో మొజ్తబా తీవ్రంగా గాయపడ్డారని, అప్పటి నుంచి అజ్ఞాతంలో ఉంటూ రహస్య నెట్‌వర్క్‌తో అధికారులతో మాట్లాడుతూ పాలన నడుపుతున్నారని నివేదికలు పేర్కొన్నాయి.

# కీలక బిల్లుల వేడి



- కాంగ్రెస్ ఎంపీలకు మూడు రోజుల విప్
- ఎఫ్‌సీఆర్‌ఏ, డీలిమిటేషన్ బిల్లులపై ఉత్కంఠ
- అమిత్ షా గైర్హాజరుపై వేణుగోపాల్ విమర్శలు
- ఏ మంత్రి ఎప్పుడు రావాలో ప్రతిపక్షం నిర్ణయించదు
- విపక్షాల తీరుపై కిరణ్ రిజిజు ఆగ్రహం
- సోమవారానికి ఉభయసభలు వాయిదా

**న్యూఢిల్లీ,**
వచ్చే వారం పార్లమెంట్ సమావేశాల్లో కీలకమైన అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉండటంతో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు మూడు రోజుల విప్ జారీ చేసింది. ఈ నెల 10, 11, 12 తేదీల్లో ఎంపీలంతా తప్పనిసరిగా సభకు హాజరై పార్టీ నిర్ణయాలకు అనుగుణంగా

-మిగతా 2 లో



02

## వృద్ధాప్యం దిశగా భారత్

- 2050 నాటికి ప్రతి ఐదుగురిలో ఒకరు వృద్ధులే
- 34.7 కోట్లకు చేరనున్న 60 ఏండ్లు పైబడిన వారి సంఖ్య
- వృద్ధుల్లో 70 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లోనే
- సంపన్న దేశంగా మారకముందే వృద్ధాప్య దశలోకి భారత్
- తక్కువ ఆదాయ స్థాయిల్లోనే జనాభా పరివర్తన
- కుటుంబాలు, సమాజంపై పెరగనున్న భారం
- వృద్ధుల సంరక్షణపై కొత్త సవాళ్లు
- పని వయసు గల వారి సంఖ్య తగ్గుతున్న వైనం
- 2001లో 8.4 మంది.. 2026 నాటికి 5.2 మందికి తగ్గుదల
- గ్రామీణ భారతంలో వృద్ధ జనాభాపై ప్రత్యేక దృష్టి అవసరం
- మారుతున్న కుటుంబ వ్యవస్థపై నివేదిక హెచ్చరిక

# వర్షాల కోసం వరుణ యాగం

## విస్తార వర్షాల కోసం సీఎం నిర్ణయం

- ఈ నెల 10న నాగార్జునసాగర్‌లో నిర్వహణ
- యాదగిరిగుట్ట అర్చకులు, ని వేదపండితుల ఆధ్వర్యంలో యాగం
- విజయవిహార్ ప్రాంగణంలో ముమ్మర ఏర్పాట్లు
- కృష్ణా--గోదావరి నదులు జలకళ సంతరించుకోవాలని సంకల్పం
- పాడిపంటల సమృద్ధి కోసం ప్రత్యేక పూజలు
- ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో యాగ క్రతువులు
- పూర్ణాహుతిలో పాల్గొననున్న సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,**
రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి జలాశయాలు నిండాలని, వ్యవసాయ రంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అర్చకులు, వేదపండితులు, సిద్ధాంతులు నిర్ణయించిన శుభ ముహూర్తం ప్రకారం ఈ నెల 10వ తేదీన నాగార్జునసాగర్‌లోఅత్యంత వైభవంగా వరుణ యాగం నిర్వహించనున్నారు.నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలోని విజయవిహార్ ప్రాంగణంలో యాగం నిర్వహణకు ఇప్పటికే విస్తృత ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా యాగ క్రతువులను నిర్వహించనున్నారు.

-మిగతా 2 లో







## బీఆర్ఎస్‌ది సోషల్ మీడియా రాజకీయం

- వాటిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదు
- రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లడమే కేటీఆర్, హరీశ్‌రావు లక్ష్యం
- బనకచర్ల విషయంలో కేంద్రం వెనక్కి తగ్గడం వెనుక రేవంత్, ఉత్తమ్ కృషి
- టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్,**
టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్‌గా తనకు అవకాశం కల్పించిన కాంగ్రెస్ అధిష్టానానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్, ప్రియాంక గాంధీ, పవన్ ఖేరా, సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాకే పరిమితమైందని చామల విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏదైనా తప్పు మాట్లాడతారా అని ఎదురు చూస్తూ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం ఆ పార్టీకి అలవాటైందన్నారు. ప్రజలకు కష్టాలు వస్తే ఆనందపడే

-మిగతా 2 లో



02

## జన్మతః పౌరసత్వంపై ట్రంప్ పిడుగు

- రెండు కీలక ఉత్తర్వులపై సంతకం
- విదేశీయుల పిల్లలకు పౌరసత్వంపై కొత్త ఆంక్షలు
- అమెరికాలోని భారతీయ కుటుంబాలకు ఇబ్బందులు తప్పవా?
- జన్మతః పౌరసత్వ విధానంలో మార్పులకు ట్రంప్ యత్నం
- 14వ రాజ్యాంగ సవరణపై మరోసారి చర్చ
- ఏటా పుట్టే భారతీయుల పిల్లల భవిష్యత్తుపై ప్రభావం
- హెచ్-1బీ, గ్రీన్‌కార్డుల తర్వాత వలస విధానంలో మరో కఠిన నిర్ణయం
- విదేశీయులపై నియంత్రణకు ట్రంప్ చర్యలు
- పౌరసత్వ నిబంధనల మార్పుపై ఆందోళనలు
- విదేశీ జర్నలిస్టుల వీసాలకూ కొత్త నిబంధనలు
- సోషల్ మీడియా ఖాతాల పరిశీలనకు అమెరికా నిర్ణయం
- వీసా మంజూరులో డిజిటల్ తనిఖీలకు ప్రాధాన్యం



## విడాకులొద్దులేండి

02

- విడాకుల పిటిషన్‌ను ఉపసంహరించుకున్న తమిళనాడు సీఎం విజయ్ భార్య సంగీత
- చెంగల్‌పట్టు ఫ్యామిలీ కోర్టులో వీడియో కాన్ఫరెన్స్
- అభ్యంతరాలు చెప్పని న్యాయస్థానం, పిటిషన్‌కు అనుమతి
- భవిష్యత్తులో కొత్త పిటిషన్‌కు స్వేచ్ఛ

## పాకిస్తాన్, సౌదీ, తుర్కియే మధ్య చారిత్రక ఒప్పందం



02

- ఏ ఒక్క దేశంపై దాడైనా.. మూడింటిపై దాడిగానే పరిగణన
- 'మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్'తో కొత్త రక్షణ కూటమి
- పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ మూడు దేశాల వ్యూహాత్మక అడుగు
- అణు సామర్థ్యం పాకిస్తాన్.. సైనిక శక్తి తుర్కియే.. చమురు బలం సౌదీ
- ఇరాన్, హౌతీ దాడుల నేపథ్యంలో రక్షణ భాగస్వామ్యం బలోపేతం
- పశ్చిమాసియాలో మారుతున్న శక్తి సమీకరణాలు

# కేసీఆర్ 'దేశానికే ఆదర్శం

### మిషన్ భగీరథకు పదేళ్లు.. హరీశ్‌రావు ప్రశంసలు



హర్ ఘర్ జల్‌కు మిషన్ భగీరథే స్ఫూర్తి

- తెలంగాణ తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారమన్న వ్యాఖ్య
- ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన పథకమని కొనియాడిన మాజీ మంత్రి
- దేశంలోనే అతిపెద్ద తాగునీటి మౌలిక వసతుల ప్రాజెక్టుగా అభివర్ణన
- ఫ్లోరోసిస్ నిర్మూలనలో కీలక పాత్ర పోషించిందని వెల్లడి
- కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనమన్న హరీశ్‌రావు
- కాంగ్రెస్ నిర్లక్ష్యంతో వ్యవస్థ బలహీనమవుతోందని ఆరోపణ
- నిర్వహణ లోపాలతో నల్లాలు ఎండుతున్నాయంటూ విమర్శ
- మిషన్ భగీరథను కాపాడాలని ప్రభుత్వానికి డిమాండ్

**హైదరాబాద్,**
తెలంగాణలో ఇంటింటికీ సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రారంభమైన 'మిషన్ భగీరథ' పథకం నేటితో పదేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బిఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆనందం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ ప్రాజెక్టుకు సంబంధించిన ఒక ప్రత్యేక వీడియోను షేర్ చేసిన ఆయన, ఇది కేవలం ఒక ప్రభుత్వ పథకం మాత్రమే కాదని, తెలంగాణ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన ఒక మహత్తరమైన తాగునీటి విప్లవం అని కొనియాడారు. సరిగ్గా పదేళ్ల క్రితం ఒక గొప్ప ఆలోచనతో

-మిగతా 2 లో



## తెలంగాణలో ఒంటరిగానే పోటీ చేస్తాం..

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు స్పష్టీకరణ
- ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని ప్రకటన
- అన్ని ఎన్నికల్లోనూ సొంత బలంతో బరిలోకి
- జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లోనూ ఒంటరి పోరు
- జనసేనతో తెలంగాణలో ఎన్నికల పొత్తు లేదని వెల్లడి
- ఎన్డీఏలో భాగస్వామి అయినా.. రాష్ట్రంలో స్వతంత్ర పోటీ
- తెలంగాణలో బీజేపీ బలపడుతోందన్న ధీమా
- రానున్న ఎన్నికల్లో అధికారమే లక్ష్యమని ప్రకటన
- క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు పనిచేయాలని పిలుపు

**హైదరాబాద్**
తెలంగాణలో ఏ రాజకీయ పార్టీతోనూ పొత్తు ఉండదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు స్పష్టం చేశారు. రానున్న అన్ని ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) ఎన్నికల్లో కూడా పార్టీ స్వతంత్రంగానే బరిలోకి దిగుతుందని వెల్లడించారు. జనసేన ఎన్డీఏ భాగస్వామ్య పక్షమే అయినప్పటికీ, తెలంగాణలో ఎన్నికల పరంగా ఎలాంటి పొత్తు ఉండదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీ బలంగా ఎదుగుతోందని, రానున్న ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని రామచందర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేసి విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.




## పాలమూరు ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం

- రైతులు ఆందోళన చెందొద్దు: మంత్రి జూపల్లి కృష్ణారావు
- కృష్ణా జలాల్లో రాష్ట్ర హక్కులను సాధించి తీరుతాం
- పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పూర్తి చేసి సాగునీరు అందిస్తాం
- పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులపై కాంగ్రెస్ సర్కార్ దృష్టి
- జూరాల, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ పనులపై సమీక్ష
- నీటి లభ్యతకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా విడుదల
- బీఆర్ఎస్ ఆరోపణలు అవాస్తవమన్న మంత్రి
- ప్రాజెక్టుల వద్ద రాజకీయ హంగామా చేస్తున్నారంటూ విమర్శ
- పదేళ్ల పాలనలో ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని ఆరోపణ
- రేవంత్, ఉత్తమ్ సారథ్యంలో పనులు పూర్తి
- పాలమూరు రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం
- పాలమూరు ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

**హైదరాబాద్**
ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తుందనీ, పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వంద శాతం పూర్తి చేసి రైతులకు సాగునీరందిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు హామీనిచ్చారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా, సాగునీటి అధికారుల ప్రణాళిక మేరకే జూరాల, నెట్టెంపాడు, భీమా,

-మిగతా 2 లో

# వృద్ధాప్యం దిశగా భారత్

**-2050 నాటికి ప్రతి ఐదుగురిలో ఒకరు వృద్ధులే**
**-34.7 కోట్లకు చేరనున్న 60 ఏండ్లు పైబడిన వారి సంఖ్య**
**-వృద్ధుల్లో 70 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లోనే**
**-సంపన్న దేశంగా మారకముందే వృద్ధాప్య దశలోకి భారత్**
**-తక్కువ ఆదాయ స్థాయిల్లోనే జనాభా పరివర్తన**
**-కుటుంబాలు, సమాజంపై పెరగనున్న భారం**
**-వృద్ధుల సంరక్షణపై కొత్త సవాళ్లు**
**-పని వయసు గల వారి సంఖ్య తగ్గుతున్న వైనం**
**-2001లో 8.4 మంది.. 2026 నాటికి 5.2 మందికి తగ్గుదల**
**-గ్రామీణ భారతంలో వృద్ధ జనాభాపై ప్రత్యేక దృష్టి అవసరం**
**-మారుతున్న కుటుంబ వ్యవస్థపై నివేదిక హెచ్చరిక**



న్యూఢిల్లీ,
భారత దేశం వృద్ధాప్యం దిశగా అడుగులు వేస్తున్నది. 2050 నాటికి దేశంలోని ప్రతి ఐదుగురిలో ఒకరు 60 ఏండ్లు, అంతకు పైబడిన వయసు వారు ఉంటారని ట్రాన్స్‌ఫార్మ్ రూరల్ ఇండియా వెల్లడించింది. అందులో 70 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తారని తెలిపింది. శుక్రవారం ఈ సంస్థ నివేదిక విడుదల చేసింది. 'గ్రామీణ భారత దేశంలో జనాభా పరిణామాలు, మారుతున్న కుటుంబ వ్యవస్థ, సంరక్షణ వ్యవస్థ భవిష్యత్' పేరిట ఈ సంస్థ నివేదిక విడుదల చేసింది. జనాభా వృద్ధులుగా మారకముందే సంపన్న దేశాలుగా మారిన అనేక అభివృద్ధి చెందిన దేశాలకు భిన్నంగా భారత్ సంపద దేశంగా మారక ముందే వృద్ధాప్య దశలోకి అడుగుపెడుతున్నదని ఈ నివేదిక హెచ్చరించింది. 2050 నాటికి దేశ జనాభాలో 34.7 కోట్ల మంది 60 ఏండ్ల పైబడిన వారు ఉంటారని, ప్రతి పదిమందిలో ఏడుగురు గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తారని తెలిపింది. అధిక శాతం జనాభా వృద్ధులుగా మారకముందే పలు అభివృద్ధి చెందిన దేశాలు సంపన్న దేశాలుగా మారాయన్నారు. అయితే భారత దేశం తక్కువ ఆదాయ స్థాయిల వద్దే జనాభా సంబంధిత పరివర్తనను ఎదుర్కొంటున్నదని ఆ నివేదిక వెల్లడించింది. ప్రతి వృద్ధునికి అండగా నిలిచే పని వయసు గల వయోజనుల సంఖ్య 2001 నాటికి 8.4 ఉండగా, 2026 నాటికి అది 5.2కు తగ్గిపోయిందని తెలిపింది. దీనివల్ల కుటుంబాలు, సమాజంపై ఒత్తిడి పెరుగుతుందని పేర్కొంది.

# బీఆర్ఎస్‌ది సోషల్ మీడియా రాజకీయం

(మొదటి తరువాయి)

విధానాన్ని కేటీఆర్, హరీశ్‌రావు మానుకోవాలని సూచించారు. గోదావరి-బనకచర్ల అంశంలో కేంద్రం వెనక్కి తగ్గడం వెనుక సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కృషి ఉందన్నారు. నీళ్ల పేరుతో మరోసారి తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. చంద్రబాబు, రేవంత్‌రెడ్డి ఒక్కటేనంటూ బీఆర్ఎస్, బీజేపీ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొడతామని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేసీఆర్ పదేళ్ల పాటు నిజాం నవాబులా పాలించారని ఆరోపించారు. వరుసగా ఐదు ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పినా ఆ పార్టీ తీరు మారలేదన్నారు. రేవంత్‌రెడ్డి విద్యార్థులకు వ్యతిరేకం కాదని, విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చామల పేర్కొన్నారు. తెలంగాణలో పరీక్ష పేపర్ల లీకేజీలు బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని ఆరోపించారు.

# వర్షాల కోసం వరుణ యాగం

(మొదటి తరువాయి)



వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేయనున్నారు. ఈ సందర్భంగా కృష్ణా, గోదావరి నదులు సమృద్ధిగా జలకళ సంతరించుకోవాలని, రాష్ట్రంలోని చెరువులు, కుంటలు, జలాశయాలు పూర్తిస్థాయిలో నిండిపోవాలని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురవాలని సంకల్పంతో వరుణ దేవుడికి ప్రత్యేక హోమాలు నిర్వహించనున్నారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో ఈ మహా వరుణ యాగం జరగనుంది. యాగం విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. యాగం అనంతరం నిర్వహించే మహత్తర పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి పాల్గొని రాష్ట్ర ప్రజల సంక్షేమం, సమృద్ధిగా వర్షాలు, వ్యవసాయాభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. రాష్ట్రంలో ప్రకృతి అనుకూలించి సమృద్ధిగా వర్షాలు కురవాలని, సాగునీటి వనరులు పుష్కలంగా నిండాలని, రైతాంగం సంతోషంగా ఉండాలని లక్ష్యంగా ప్రభుత్వం ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# విడాకులొద్దులేండి

**-విడాకుల పిటిషన్‌ను ఉపసంహరించుకున్న తమిళనాడు సీఎం విజయ్ భార్య సంగీత**
**- చెంగల్‌పట్టు ఫ్యామిలీ కోర్టులో వీడియో కాన్ఫరెన్స్**
**- అభ్యంతరాలు చెప్పని న్యాయస్థానం, పిటిషన్‌కు అనుమతి**
**- భవిష్యత్తులో కొత్త పిటిషన్‌కు స్వేచ్ఛ**



**చెన్నాయ్**
చెన్నై సమీపంలోని చెంగల్‌పట్టు ఫ్యామిలీ కోర్టులో దాఖలు చేసిన విడాకుల పిటిషన్‌ను తమిళనాడు ముఖ్యమంత్రి సీ జోసెఫ్ విజయ్ భార్య సంగీతా శుక్రవారం ఉపసంహరించుకున్నారు. వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా కోర్టు ముందు హాజరై విడాకుల కేసును ముందుకు తీసుకెళ్లాలని కోరుకోవడంలేదని ఆమె నిర్ధారించారు. ఆమె సమర్పణ ఆధారంగా కోర్టు పిటిషన్ ఉపసంహరణకు అనుమతి ఇచ్చి కేసును ఉపసంహరించినట్లు కొట్టివేసింది. అధికారిక కోర్టు వర్గాలు ఈ విషయాన్ని తెలిపాయి. కోర్టు ఆర్డర్ ప్రకారం సంగీతా ఫ్యామిలీ కోర్టు కేసు ఎఫ్‌సీఎస్ఎంటిపీ నం.102/2026లో ఉపసంహరణ పిటిషన్ దాఖలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె ఇకపై ఈ కేసును కొనసాగించాలని కోరుకోవడం లేదని చేసిన ప్రకటనను కోర్టు నమోదు చేసింది. ప్రతివాది న్యాయవాదికి నోటీసు జారీ చేశారు. ఆయన ఉపసంహరణకు ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. కోర్టు సంగీతాకు పిటిషన్ ఉపసంహరించుకోవడానికి అనుమతి ఇచ్చింది. అవసరమైతే భవిష్యత్తులో కొత్త పిటిషన్ దాఖలు చేసుకునే స్వేచ్ఛను కూడా కల్పించింది.

# కీలక బిల్లుల వేడి

(మొదటి తరువాయి)

వ్యవహరించాలని ఆదేశించింది. రాజ్యసభలో కాంగ్రెస్ చీఫ్ విప్ జైరాం రమేష్ సభ్యులకు విప్ జారీ చేశారు. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమైనప్పటి నుంచి కార్యకలాపాలు ముగిసే వరకు సభ్యులంతా సభలోనే ఉండాలని, పార్టీ వైఖరికి మద్దతుగా ఓటు వేయాలని సూచించారు. లోక్‌సభలోని కాంగ్రెస్ ఎంపీలకు కూడా ఇదే తరహాలో విప్ జారీ చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వచ్చే వారం విదేశీ విరాళాల నియంత్రణ చట్టం సవరణ బిల్లు పార్లమెంట్ ముందుకు వచ్చే అవకాశం ఉందన్న సమాచారంతో కాంగ్రెస్ అప్రమత్తమైంది. అదే సమయంలో నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశముందన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో ఉత్కంఠను పెంచుతోంది. అయితే పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి వెల్లడించిన తాత్కాలిక ప్రభుత్వ కార్యక్రమాల జాబితాలో ఏ ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు, డీలిమిటేషన్‌కు సంబంధించిన మహిళా రిజర్వేషన్ బిల్లుల ప్రస్తావన లేకపోవడంతో ఏం జరగనుందనే ఉత్కంఠ కొనసాగుతోంది. దీంతో ఈ రెండు అంశాలపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందనే దానిపై స్పష్టత కోసం ప్రతిపక్షాలు ఎదురుచూస్తున్నాయి. మరోవైపు పార్లమెంట్ కార్యకలాపాలు సాఫీగా సాగకపోవడానికి ప్రతిపక్షాలే కారణమంటూ కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ తీవ్రంగా స్పందించారు. పార్లమెంటుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా నిరంతరం గైర్హాజరవుతున్నారని ఆయన ఆరోపించారు. పార్లమెంటులో అతిపెద్ద హాస్యాస్పదం కిరణ్ రిజిజు చేసిన ప్రకటన. కేంద్ర హోం మంత్రి అమిత్ షాను పార్లమెంటుకు రాకుండా ఎవరు ఆపారు? అని వేణుగోపాల్ ప్రశ్నించారు. ఏ మంత్రి ఎప్పుడు సభకు రావాలో ప్రతిపక్షం నిర్ణయించదన్న రిజిజు వ్యాఖ్యల నేపథ్యంలో వేణుగోపాల్ ఈ విమర్శలు చేశారు. సభలో కీలకమైన ప్రశ్నలకు సంబంధిత మంత్రులు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఉందని కాంగ్రెస్ వాదిస్తోంది.

**ప్రతిపక్షాలే సభకు అడ్డంకి: కిరణ్ రిజిజు**

కాంగ్రెస్ ఆరోపణలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఖండించారు. ప్రతిపక్షాల ఆందోళనలు, నినాదాల మధ్య కూడా పార్లమెంట్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని, పలు బిల్లులు ఆమోదం పొందుతున్నాయని చెప్పారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు సభను తప్పుదోవ పట్టిస్తున్నారని కిరణ్ రిజిజు ఆరోపించారు. ఏ మంత్రి ఎప్పుడు సభకు రావాలో ప్రతిపక్షం నిర్ణయించదు. సభ కార్యకలాపాలకు బాధ్యత వహించే మంత్రి సమాధానం ఇస్తారని అని స్పష్టం చేశారు. ఉదయం పార్లమెంట్ ప్రారంభమైనప్పటి నుంచి రాత్రి ముగిసే వరకు హోం మంత్రి పార్లమెంట్లోనే ఉంటారని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్షాల నిరసనలు, నినాదాల కారణంగా సభలో చర్చలకు కేటాయించే సమయం తగ్గుతోందని రిజిజు విమర్శించారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాన్ని నిర్వహించే ప్రతిపాదన ఏదీ లేదని కూడా ఆయన స్పష్టం చేశారు.

**ఉభయసభల్లో వాయిదాల పర్వం**

నీట్ పేపర్ లీక్, అయోధ్య కానుకల చోరీ తదితర అంశాలపై ప్రతిపక్ష సభ్యుల ఆందోళనతో దిగడంతో పార్లమెంట్ ఉభయసభల్లో కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ ఓం బిర్లా 1942 ఆగస్టు 9న ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమం వార్షికోత్సవాన్ని ప్రస్తావిస్తూ స్వాతంత్ర్య సమరయోధుల సేవలను కొనియాడారు. క్విట్ ఇండియా ఉద్యమం సత్యం, అహింసకు ప్రతీక అని పేర్కొన్నారు. గాంధీజీ బోధనల నుంచి అందరూ స్ఫూర్తి పొందాలని, పార్లమెంట్లో సభ్యుల ప్రవర్తన సభ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. అయితే ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలు కొనసాగాయి. వారి నిరసనల మధ్యే ఎంఎన్‌సిఎం చట్ట సవరణ బిల్లును లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. అనంతరం సభ మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడింది. తిరిగి సమావేశమైన తర్వాత కూడా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో లోక్‌సభను సోమవారానికి వాయిదా వేశారు. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్రతిపక్ష సభ్యుల నిరసనల నేపథ్యంలో సభ కార్యకలాపాలు సజావుగా సాగకపోవడంతో రాజ్యసభను కూడా సోమవారానికి వాయిదా వేశారు.

**వచ్చే వారం కీలక పరిణామాలకు వేదిక**

కాంగ్రెస్ ఎంపీలకు మూడు రోజుల విప్ జారీ కావడం, ఎఫ్‌సీఆర్ఏ సవరణతో పాటు డీలిమిటేషన్‌కు సంబంధించిన బిల్లులపై చర్చకు అవకాశం ఉందన్న ప్రచారం నేపథ్యంలో వచ్చే వారం పార్లమెంట్ సమావేశాలు కీలకంగా మారనున్నాయి. ఒకవైపు ప్రభుత్వం కీలక బిల్లులను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా, మరోవైపు ప్రతిపక్షాలు వాటిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసేందుకు సిద్ధమవుతున్నాయి. దీంతో ఈ నెల 10 నుంచి 12 వరకు పార్లమెంట్లో అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ పోరు మరింత ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి. బిల్లులపై చర్చ, ఓటింగ్ సమయంలో సభ్యుల సంఖ్య కీలకం కానుండటంతో కాంగ్రెస్ ముందుగానే తన ఎంపీలకు విప్ జారీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# జన్మతః పౌరసత్వంపై ట్రంప్ పిడుగు

**-రెండు కీలక ఉత్తర్వులపై సంతకం**
**-విదేశీయుల పిల్లలకు పౌరసత్వంపై కొత్త ఆంక్షలు**
**-అమెరికాలోని భారతీయ కుటుంబాలకు ఇబ్బందులు తప్పవా?**
**-జన్మతః పౌరసత్వ విధానంలో మార్పులకు ట్రంప్ యత్నం**
**-14వ రాజ్యాంగ సవరణపై మరోసారి చర్చ**
**-ఏటా పుట్టే భారతీయుల పిల్లల భవిష్యత్తుపై ప్రభావం**
**-హెచ్-1బీ, గ్రీన్‌కార్డుల తర్వాత వలస విధానంలో మరో కఠిన నిర్ణయం**
**-విదేశీయులపై నియంత్రణకు ట్రంప్ చర్యలు**
**-పౌరసత్వ నిబంధనల మార్పుపై ఆందోళనలు**
**-విదేశీ జర్నలిస్టుల వీసాలకూ కొత్త నిబంధనలు**
**-సోషల్ మీడియా ఖాతాల పరిశీలనకు అమెరికా నిర్ణయం**
**-వీసా మంజూరులో డిజిటల్ తనిఖీలకు ప్రాధాన్యం**



న్యూయార్క్ :
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో షాక్ ఇచ్చారు. ఇప్పటికే హెచ్-1బీ వీసా, గ్రీన్‌కార్డులపై ఎన్నో ఆంక్షలు పెడుతున్న ట్రంప్.. ఇప్పుడు జన్మతః వచ్చే పౌరసత్వాన్ని నియంత్రించేందుకు రెండు కొత్త ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ల మీద సంతకం చేశారు. దీని ముఖ్య ఉద్దేశం అమెరికాలో విదేశీయుల పిల్లలకు జన్మతః పౌరసత్వాన్ని రాకుండా చేయడమే. అమెరికాలో పుట్టిన వారందరినీ అమెరికన్లుగానే పరిగణించాలని యూఎస్ సుప్రీంకోర్టు గత నెలలో తీర్పునిచ్చిన క్రమంలో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సారి మరికొన్ని మార్పులు చేస్తున్నామని చెప్పారు. 1986లో అమోదించిన 14వ రాజ్యాంగ సవరణ ప్రకారం.. విదేశీయులు అమెరికాకు వచ్చి జన్మనిస్తే వారి పిల్లలకు జన్మతః అమెరికా పౌరసత్వం దక్కుతుంది. దీన్ని నియంత్రించాలని ట్రంప్ చాలా ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు ట్రంప్ తీసుకొస్తున్న ఉత్తర్వుల వల్ల భారతీయుల పిల్లలు అమెరికా పౌరసత్వం పొందడం చాలా కష్టతరం అయ్యేలా ఉంది. ప్రతి ఏటా భారతీయుల పిల్లలు 2.5 లక్షల మంది అమెరికాలో జన్మిస్తున్నారు. ఇప్పుడు వారందరికీ పౌరసత్వం విషయంలో ఇబ్బందులు ఎదురు కానున్నాయి.

**విదేశీ జర్నలిస్టు వీసాలపై కొత్త రూల్**

యూఎస్‌లో పనిచేయడానికి వీసాల కోసం ఐప్లై చేసుకునే విదేశీ జర్నలిస్టులకు ట్రంప్ ప్రభుత్వం కొత్త రూల్ తీసుకొచ్చింది. ఇక నుంచి వారి సోషల్ మీడియా ఖాతాలను కూడా పరిశీలించనున్నట్టు యూఎస్ స్టేట్ డిపార్టుమెంట్ తెలిపింది. ట్రంప్ రూల్ ప్రకారం అమెరికా వీసా కావాలనుకునేవారు కచ్చితంగా వారి సోషల్ మీడియా ఖాతాలను వెల్లడించాల్సిందే. ఇప్పుడు ఈ రూల్‌ను అంతర్జాతీయ మీడియా ప్రతినిధులకు కూడా విస్తరించనున్నారు. యూఎస్ స్టేట్ డిపార్ట్ మెంట్ ప్రతినిధి మాట్లాడుతూ.. విదేశీ జర్నలిస్టులు యూఎస్ వీసాకు అర్హులా కాదా అనే విషయాన్ని వారి సోషల్ మీడియా ఖాతాల ద్వారా తెలుసుకున్న తర్వాతే జారీ చేస్తామని ఇది అత్యంత కీలకమని తెలిపారు.

# కేసీఆర్ 'దేశానికే ఆదర్శం

(మొదటి తరువాయి)

రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్ట్, తెలంగాణ ప్రజల దశాబ్దాల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపిందని హరీశ్ రావు పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ నిరంతరం స్వచ్ఛమైన నల్లా నీరు అందించిన ఈ వ్యవస్థ, దేశంలోనే అతిపెద్ద తాగునీటి మౌలిక వసతుల ప్రాజెక్టుగా చరిత్ర సృష్టించిందని తెలిపారు. ముఖ్యంగా తెలంగాణను దశాబ్దాలుగా పీడించిన ఫ్లోరోసిస్ రక్కసిని శాశ్వతంగా రూపుమాపడంలో ఈ పథకం కీలక పాత్ర పోషించిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'హర్ ఘర్ జల్' పథకానికి కూడా మిషన్ భగీరథే రోల్ మోడల్‌గా నిలిచి, దేశవ్యాప్తంగా అపారమైన ప్రశంసలు అందుకుందని ఆయన గుర్తుచేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టికి, ఆచరణాత్మక ఆలోచనలకు మిషన్ భగీరథ ప్రత్యక్ష నిదర్శనమని హరీశ్ రావు అభివర్ణించారు. అయితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్యం కారణంగా ఈ సుజల వ్యవస్థ నిర్వీర్యమవుతోందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో నిరంతరం ప్రవహించిన నల్లాలు ఇప్పుడు ఎండిపోయే పరిస్థితి వస్తోందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ మహత్తర ప్రాజెక్టును సక్రమంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

# పాలమూరు ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం

(మొదటి తరువాయి)

కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీటి నిర్వహణ జరుగుతోందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాకు నీళ్లు ఇవ్వడం లేదంటూ బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, ప్రజలను తప్పుదోవ పట్టించి రాజకీయ లబ్ధి పొందేందుకే ఆ పార్టీ నేతలు ప్రాజెక్టుల వద్ద హంగామా చేస్తున్నారని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయం మీడియా సెంటర్‌లో ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, ఈఎన్సీ (జనరల్) రమేష్‌బాబు, సీఈ విజయభాస్కర్‌రెడ్డితో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా జూరాలతో పాటు ఇతర ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో పెరుగుతోందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. పై నుంచి వస్తున్న నీటికి అనుగుణంగా సాగునీటి అధికారులు ప్రణాళిక ప్రకారం కిందికి విడుదల చేస్తున్నారని చెప్పారు. ఈ విషయం ముందే తెలిసిన బీఆర్ఎస్ నేతలు ప్రాజెక్టుల వద్ద హంగామా, డ్రామాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తమ ఒత్తిడితోనే అధికారులు నీటిని విడుదల చేశారంటూ ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. పాలమూరు బిడ్డ సీఎం రేవంత్‌రెడ్డి, ఆ జిల్లా అల్లుడు సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతులకు నీరివ్వటం లేదంటూ గులాబీ పార్టీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమన్నారు. రేవంత్, ఉత్తమ్ సారథ్యంలోనే ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు కాంగ్రెస్ హయాంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. లక్షల ఎకరాలకు సాగునీరందించే ఆ ప్రాజెక్టులను పదేండ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కల్వకుర్తి కింద అదనంగా 25 టీఎంసీల నీటిని అందించే ప్రాజెక్టును ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి ఎత్తిపోతల పనులను ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. పంపులు, మోటార్లు, కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు.

# పాకిస్తాన్, సౌదీ, తుర్కియే మధ్య చారిత్రక ఒప్పందం

**ఏ ఒక్క దేశంపై దాడైనా.. మూడింటిపై దాడిగానే పరిగణన**
**'మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్'తో కొత్త రక్షణ కూటమి**
**పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ మూడు దేశాల వ్యూహాత్మక అడుగు**
**అణు సామర్థ్యం పాకిస్తాన్.. సైనిక శక్తి తుర్కియే.. చమురు బలం సౌదీ**
**ఇరాన్, హౌతీ దాడుల నేపథ్యంలో రక్షణ భాగస్వామ్యం బలోపేతం**
**పశ్చిమాసియాలో మారుతున్న శక్తి సమీకరణాలు**




జిగడ్డలా పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం నడుమ ఒక సంచలన పరిణామం చోటుచేసుకుంది. భద్రతాపరమైన ఆందోళనలను సమర్థంగా ఎదుర్కొనేందుకు మూడు ఇస్లామిక్ అగ్ర దేశాలు చేతులు కలిపాయి. అణుఆయుధ సామర్థ్యం ఉన్న పాకిస్తాన్, చమురు సంపన్న దేశం సౌదీ అరేబియా, నాటోలో అత్యంత బలమైన సైన్యం ఉన్న తుర్కియేలు ఒక చారిత్రక రక్షణ ఒప్పందం కుదుర్చుకున్నాయి. 'మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్' పేరుతో కుదిరిన ఈ ఒప్పందం ప్రకారం, ఈ మూడింటిలో ఏ ఒక్క దేశంపై దాడి జరిగినా దాన్ని మూడింటిపై జరిగిన దాడిగానే పరిగణిస్తారు. సౌదీ అరేబియా, పాకిస్తాన్, తుర్కియే రక్షణ రంగానికి సంబంధించి ఒక బలమైన కూటమిగా ఏర్పడ్డాయి. శుక్రవారం సౌదీ అరేబియాలో జరిగిన ఒక అత్యున్నత స్థాయి సమావేశంలో సౌదీ క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్, తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్, పాకిస్తాన్ ప్రధాని మంత్రి షెహబాజ్ షరీఫ్ మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్‌పై సంతకాలు చేశారు. ఈ మూడు దేశాల్లో ఏ ఒక్కదానిపై సాయుధ దాడికి పాల్పడినా, అది తమ అందరిపై జరిగిన దాడిగానే భావించి ఉమ్మడిగా స్పందిస్తామని పాకిస్తాన్ విదేశాంగ శాఖ ఒక అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ ఒప్పందం ద్వారా ఉమ్మడి సైనిక విన్యాసాలు, రక్షణ దళాలకు ప్రత్యేక శిక్షణ, సాంకేతిక బదిలీ, ఇంటెలిజెన్స్ సమాచార మార్పిడికి మార్గం సుగమం కానుంది. "'మక్కా సంయుక్త రక్షణ ఒప్పందం' ప్రకారం ఏ విధమైన దురాక్రమణ చర్యకైనా వ్యతిరేకంగా సామూహిక నిరోధక శక్తిని బలోపేతం చేస్తోంది. ఈ మూడు దేశాల్లో దేనిపైకైనా జరిగే సాయుధ దాడిని వాటన్నింటిపై జరిగిన దాడిగా పరిగణించాలని ఇది నిర్దేశిస్తుంది. ఇది మూడు దేశాల మధ్య రక్షణ సహకారానికి సంబంధించిన అన్ని అంశాలను పెంపొందించడానికి కూడా వీలు కల్పిస్తుంది. సురక్షితమైన, సుసంపన్నమైన భవిష్యత్తును సాధించే క్రమంలో తమ సామూహిక భద్రతను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తోంది. ఈ ప్రాంతంలో, వెలుపల కూడా శాంతి, భద్రత, స్థిరత్వాన్ని ప్రోత్సహించడానికి మూడు దేశాల ఉమ్మడి నిబద్ధతను ఈ ఒప్పందం ప్రతిబింబిస్తుంది.'

# గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను స్వలాభ పనులకు వాడుతున్నారని ప్రజల ఆరోపణలు

**-ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నందుకు గ్రామస్తులపై బెదిరింపులు**

**మంథని, ఆగస్టు 07; నవ సంఘర్షణ**
పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని ఆరెంద గ్రామ పంచాయతీ ఆస్తుల దుర్వినియోగం, అక్రమ ఇసుక రవాణాపై ప్రశ్నిస్తే భయ భ్రాంతులకు గురి చేస్తున్నారు. గ్రామ ప్రజల ఆస్తులను సంరక్షించాల్సిన ప్రజా ప్రతినిధులు, అధికారులు స్వలాభం కొరకు వినియోగిస్తున్నారంటూ ఉప సర్పంచ్ కొమ్మిడి శ్రీనివాస్, వార్డు సభ్యులు చీమ భానేష్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు అనిల్ కుమార్ గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై వెంటనే సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు జిల్లా అధికారులను కోరుతున్నారు. గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌ను గ్రామ సర్పంచ్ తన వ్యక్తిగత కాంట్రాక్ట్ పనులకు తరచూ వినియోగిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. గ్రామాభివృద్ధి పనులు, ప్రజా అవసరాల కోసం ఉపయోగించాల్సిన ట్రాక్టర్‌ను వ్యక్తిగత అవసరాలకు వాడటం వల్ల గ్రామ పంచాయతీ కి నష్టం చేస్తూ ప్రజల సొత్తును దుర్వినియోగం చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీనిపై పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ వారి పద్ధతిలో



ఎలాంటి మార్పు వస్తలేదని వారు పేర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి అనుమతి లేకుండానే కారోబార్ ట్రాక్టర్‌ను తీసుకెళ్లి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయాన్ని గమనించిన కొందరు గ్రామస్థులు ట్రాక్టర్‌ను అడ్డుకొని ప్రశ్నించగా వారిపై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా, బెదిరింపులకు పాల్పడినట్లు గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజా ప్రతినిధులపై ఇలాంటి ఆరోపణలు రావడం గ్రామ ప్రజలను ఆశ్చర్యానికి గురి చేసింది. ప్రజల పన్నుల ద్వారా సమకూరిన గ్రామ పంచాయతీ ఆస్తులను ప్రజల అవసరాలకు తప్ప వ్యక్తిగత లాభాల కోసం వినియోగించ రాదని గ్రామ పెద్దలు భావిస్తున్నారు. అక్రమ ఇసుక రవాణా గ్రామంలో కొంత కాలంగా కొనసాగుతోందని, దీనిపై పలుమార్లు అధికారులకు సమాచారం ఇచ్చినా ఇప్పటివరకు సమగ్ర విచారణ జరగలేదని వారు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారి తహసీల్దార్, జిల్లా పంచాయతీ అధికారి, పోలీసు అధికారులు వెంటనే స్పందించి పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ట్రాక్టర్ వినియోగానికి సంబంధించిన రికార్డులు, ఇంధన వినియోగ వివరాలు, ఇసుక రవాణాపై వచ్చిన ఆరోపణలు, గ్రామస్తులను బెదిరించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిజాలు వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే గ్రామ సర్పంచ్, కార్యదర్శి, కారోబార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించిన వారిని కఠినంగా శిక్షించాలని, గ్రామ ఆస్తులను తిరిగి ప్రజా ప్రయోజనాలకే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు..

# యాదవుల ఐక్యతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**మంథని, ఆగస్టు 07; నవ సంఘర్షణ**
యాదవుల అభివృద్ధి, ఐక్యత, సామాజిక చైతన్యమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న 21 రోజుల శ్రీకృష్ణ సేవా విద్యానిధి యాత్రను విజయవంతం చేయాలని యాదవ మహాసభ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం యాదవ్ పిలుపునిచ్చారు. మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మేకల మల్లేశం యాదవ్ మాట్లాడుతూ యాదవ సమాజంలోని ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగినప్పుడే సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ముఖ్యంగా యాదవ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు చేయూత అందించడంతో పాటు, పేద విద్యార్థులకు అండగా నిలిచేందుకు శ్రీకృష్ణ సేవా, విద్యానిధి యాత్ర చేపట్టినట్లు వారు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 21 రోజుల పాటు కొనసాగనున్న



ఈ యాత్రలో యాదవ సమాజ సభ్యులను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందించనున్నట్లు నాయకులు తెలిపారు. విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, సామాజిక చైతన్యంపై విస్తృతంగా అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు14న ప్రారంభమయ్యే ఈ యాత్రలో యాదవ సోదరులు, యువత, మహిళలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. యాదవుల ఐక్యతను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యాదవ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మరేం తిరుపతి యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉడుత పర్వతాలు యాదవ్, ప్రధాన కార్యదర్శి భాష అశోక్ యాదవ్, ట్రస్ట్ సభ్యుడు పర్ష ఐక్కన్న యాదవ్, జిల్లా నాయకుడు కనవేన శ్రీనివాస్ యాదవ్, మంథని మండల యాదవ సంఘం అధ్యక్షుడు మోహన్ యాదవ్, మండల ఉపాధ్యక్షులు వేముల లక్ష్మణ్ యాదవ్, కనగంటి ఓదెలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు..

# ప్రజల అవసరాలకు అనుగుణంగా శాఖల వారీగా కార్యాచరణ రూపొందించాలి

**-మంథని మండల సర్వసభ్య సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**

**మంథని, ఆగస్టు 07; నవ సంఘర్షణ**
మంథని మండలంలో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు పూర్తి స్థాయిలో చేరేలా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం మంథని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వ్యవసాయం, వైద్యం, విద్య, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, ఐసీడీఎస్, విద్యుత్, ఉద్యానవనం, రవాణా, నీటిపారుదల, ఆర్ అండ్ బి తదితర శాఖలు అమలు చేస్తున్న కార్యక్రమాల పురోగతిని శాఖల వారీగా సమీక్షించారు. వీబీజీ రామ్‌జీ పథకం కింద చేపడుతున్న జలసిరి కార్యక్రమం, ఇంకుడు గుంతలు, పంట కుంటలు ఇతర సహజ వనరుల అభివృద్ధి పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసి గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని



సూచించారు. వ్యవసాయ రంగంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, రైతులకు క్షేత్రస్థాయిలో సాంకేతిక సలహాలు అందించాలని తెలిపారు. యూరియా పంపిణీ పారదర్శకంగా జరిగేలా పర్యవేక్షించడంతో పాటు సేంద్రియ సాగు విధానాలపై రైతులను మరింతగా ప్రోత్సహించాలని సూచించారు. మిషన్ భగీరథ పరిధిలో నీటి సరఫరా వ్యవస్థలో ఉన్న సమస్యలను గ్రామాల వారీగా గుర్తించి, శాశ్వత పరిష్కారాల కోసం సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా ఎక్కడా నిలిచిపోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని చెప్పారు. విద్యుత్ శాఖ అధికారులు గ్రామాల్లో విద్యుత్ అంతరాయాలు తగ్గించేలా నిర్వహణ పనులు చేపట్టాలని దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లను ఆలస్యం చేయకుండా మరమ్మతు చేయడం లేదా అవసరమైతే కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మంథని తాసిల్దార్ ఆరిఫుద్దీన్, ఎంపీడీవో శ్రీజ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి పూర్ణచందర్, ఎఎంసి చైర్మన్ కుడుదుల వెంకన్న, పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జి కొత్త శ్రీనివాస్, శశి భూషణ్ కాచే, మంథని సురేష్ వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు..

# జూనియర్ కళాశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

**-నోట్‌బుక్స్ అందజేసిన ప్రజాప్రతినిధులు..**

**మిడ్జిల్, ఆగస్టు 07; నవ సంఘర్షణ**
మిడ్జిల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఎడ్ల శంకర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి చేతుల మీదుగా విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేయడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు



మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలు కూడా కల్పించాలని కోరారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడంతో పాటు యూనిఫాంలు, షూస్ అందించేలా జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అష్రఫ్ ఉన్నీసా బేగం, కళాశాల లెక్చరర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మంథని సాయిబాబా ఆలయంలో సౌందర్యలహరి



**మంథని, ఆగస్టు 07; నవ సంఘర్షణ**
మంథని పట్టణంలోని షిరిడి సాయిబాబా ఆలయంలో శుక్రవారం సౌందర్య లహరి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గట్టు గొలుగుల మాధవి బృందం ఆలపించిన ఈ కార్యక్రమం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. గత రెండు సంవత్సరాలుగా పట్టణంలోని అనేక మంది మహిళలు భక్తి భావన పెంపొందించుకోవడంలో మాధవి ఎంతో తోడ్పాటును అందిస్తుంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షురాలు మహావాది జలజ, ఆలయ అర్చకుడు శ్రీనివాస్, పట్టణంలోని మహిళా భక్తులు పాల్గొన్నారు..

# రాజాపూర్ మండల టీయూడబ్ల్యూజే (హెచ్-143) నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**మిడ్జిల్, ఆగస్టు 07; నవ సంఘర్షణ**
: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే--హెచ్-143) మహబూబ్‌నగర్ జిల్లా అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో రాజాపూర్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ వరంగల్ శివకుమార్, కో-కన్వీనర్ చింతకాయల వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ప్రకటించారు.
ఈ సందర్భంగా జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి పరిరక్షణ, సభ్యుల సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. జర్నలిస్టుల ఐక్యతతో సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. రాజాపూర్ మండల అధ్యక్షుడుగా బోళ్ళ రాఘవేందర్ ,ప్రధాన కార్యదర్శిగా నేరాళ్ల గణేష్ గౌడ్, ఉపాధ్యక్షుడు కమ్మరి సతీష్ చారి, సంయుక్త కార్యదర్శి రాజేష్, ప్రచార కార్యదర్శి శేఖర్, నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు జిల్లా నాయకులు శుభాకాంక్షలు తెలియజేస్తూ, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణతో పాటు సంఘ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. సమావేశంలో పలువురు జర్నలిస్టులు పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

# అనారోగ్యంతో ఉన్న జర్నలిస్టు పరంజ్యోతికి పాత్రికేయుల పరామర్శ

**--ఆర్థిక సాయం అందజేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**

**మిడ్జిల్, ఆగస్టు 07; నవ సంఘర్షణ**
మిడ్జిల్ మండల వార్త రిపోర్టర్ పరంజ్యోతి ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న విషయం



తెలుసుకున్న పాత్రికేయ మిత్రులు శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తోటి జర్నలిస్టులు పరంజ్యోతికి ఆర్థిక సహాయం అందజేసి, ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే పాత్రికేయులకు కష్టకాలంలో సహచరులు అండగా నిలవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. పరామర్శకు వచ్చిన పాత్రికేయ మిత్రులందరికీ పరంజ్యోతి కృతజ్ఞతలు తెలియజేస్తూ, వారి ఆత్మీయత తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయ సంఘం నాయకులు మహేష్ కుమార్, శ్రీనివాసులు, సత్యనారాయణ గౌడ్, నిస్సార్, రమేష్, మల్లేష్, బాల్ నారాయణ, వరుణ్ రాజ్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రులు ఎంపీ డాక్టర్ మల్లురవి వినతి

**ఆమనగల్లు,ఆగస్టు 07; నవ సంఘర్షణ**
తెలంగాణ రాష్ట్ర ఎంపీల ఫోరం రాష్ట్ర కన్వీనర్, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లు రవి, మరియు ఎంపీ సురేష్ శతాబ్ది, కేంద్ర రసాయనాలు



మరియు ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా ను పార్లమెంట్ కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ వినతి పత్రంపై కాంగ్రెస్ పార్టీ కి చెందిన లోక్ సభ ఎంపీలందరూ సంతకాలు చేసిన పత్రాన్ని కేంద్రమంత్రి కి సమర్పించారు. ఈ వినతి పత్రంపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ మల్లురవి తెలియజేశారు.

# సంపాదకీయం

## అణ్వస్త్ర వ్యాప్తికి అమెరికా ఆజ్యం



ప్రపంచానికి ఇప్పుడు కావలసింది అన్నవస్త్రాలా, అణ్వాస్త్రాలా?.. ప్రపంచంలో దాదాపు వందకోట్ల మంది పేదరికంలో మగ్గిపోతూ కూడూ గుడ్డా లేక అలమటిస్తుంటే అగ్రరాజ్యాలు మొదలుకొని వర్ధమాన దేశాలు కూడా అణ్వాయుధాలను సమకూర్చుకునే ప్రయత్నంలో ఉండడం శోచనీయం. అణ్వాస్త్ర వ్యాప్తికి మొదట ఆజ్యంపోసింది అమెరికాయే. రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ ఫాసిజాన్ని తుదముట్టించడానికి సోవియెట్ సైనిక దళాలు పురోగమించడాన్ని అమెరికా ఓర్వలేకపోయింది. సోవియెట్ యూనియన్‌ను కట్టడి చేయడానికి తన సత్తా నిరూపించడానికి 1945 ఆగస్టు 6న జపాన్ లోని హిరోషిమా నగరంపై అణుబాంబు ప్రయోగించింది. ఆ నగరం బూడిద కుప్పలా కూలిపోవడంతోపాటు 1.4 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. నాలుగు రోజులు పోయిన తరువాత జపాన్ లోనే నాగసాకి పట్టణంపై అణుబాంబులు కుమ్మరించింది. 90 వేల మందిని పొట్టన పెట్టుకుంది. మెన్‌హట్టన్ ప్రాజెక్టు ద్వారా తాను రూపొందించిన అణుబాంబులు ఎంతమందిని చంపగలవో తెలుసుకోడానికే నాగసాకిపై దాడి చేసిందంటే అమెరికా మారణకాండ ఎంతటి వినాశనానికి దారితీస్తోందో చెప్పవచ్చు. ఈ విలయం జరిగి ఇప్పటికి 80 ఏళ్లు అయినా అమెరికా తాను సాగించిన మారణకాండకు పశ్చాత్తాపం పడడం లేదు. ఇప్పటికీ ఇరాన్ వంటి దేశాలపై ఏవో సాకులు చూపించి దాడులు సాగిస్తోంది. అమెరికా అణ్వస్త్ర పోటీని చూసి సోవియెట్, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు కూడా అణ్వస్త్ర అగ్రరాజ్యాలుగా వర్ధిల్లడం వినాశనానికే తప్ప మానవ క్షేమం కోసం కాదు. అమెరికా అణుబాంబుల ప్రయోగం తరువాత నాలుగేళ్లకు సోవియెట్ యూనియన్ 1949 నాటికి అణుబాంబుల తయారీ సామర్థ్యాన్ని పెంచుకుంది. అణుబాంబు కన్నా వంద రెట్లు శక్తివంతమైన హైడ్రోజన్ బాంబును 1952 నవంబరు 1న అమెరికా పరీక్షించగా, సోవియెట్ 1953 ఆగస్టు 12న హైడ్రోజన్ బాంబు తయారు చేసుకోగలిగింది. భారత్, పాకిస్థాన్, ఇజ్రాయెల్, ఉత్తర కొరియా దేశాలు కూడా అణ్వస్త్ర పోటీలో పాలుపంచుకుంటుండడం గమనార్హం. హిరోషిమాపై అమెరికా ప్రయోగించిన అణుబాంబు కంటే రెండువేల రెట్లు సామర్థ్యంగల అణు, హైడ్రోజన్ బాంబులు ఐదు వేలకు పైగా నేడు అమెరికా గిడ్డంగిలో ఉండడం విశేషం. అగ్రరాజ్యాలు అమెరికా, రష్యాల వద్ద సుమారు 10 వేల అణుబాంబులు ఉండగా, మిగిలిన దేశాలన్నిటి వద్ద సుమారు వెయ్యివరకు ఉన్నాయి. అమెరికాతో సమానంగా చైనా ఆయుధ పోటీ పెరుగుతోంది. 2020 లో కేవలం 200 అణ్వాస్త్రాలు ఉన్న చైనా 2026 నాటికి 600 వరకు పెంచుకుంది. 2035 నాటికి 1500 వరకు పెంచుకోగలదని అమెరికా అంచనా వేస్తోంది. మొత్తం అణుశక్తి దేశాలు సంయుక్తంగా 12,000 కంటే ఎక్కువ అణ్వాయుధాలను కలిగిఉన్నాయని అంచనా. మొత్తం ఈ అణుబాంబులన్నీ ప్రయోగిస్తే కొన్ని కోట్ల మంది క్షణాల్లో ప్రాణాలు కోల్పోతారు. ఒకే ఒక ఆధునిక థర్మో న్యూక్లియర్ ఆయుధం ఒక మహా నగరాన్నే తుడిచిపెట్ట గలదు. అణ్వాయుధాల పరిమితి కోసం కుదిరిన ఒప్పందాలన్నిటిలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వైదొలగడం ఆయన సామ్రాజ్య కాంక్ష స్పష్టమవుతోంది. 2002లో బాలిస్టిక్ క్షిపణి వ్యతిరేక (ఎబిఎం) ఒప్పందం నుంచి, 2015లో అణ్వస్త్ర వ్యాప్తి నిరోధంపై ఇరాన్‌తో కుదిరిన ఒప్పందం నుంచి, 2018లో జెసిపిఒఎ అనే అణుఒప్పందం నుంచి, 2019లో అమెరికా మధ్యశ్రేణి అణుక్షిపణి ఒప్పందం నుంచి, 2021లో ఓపెన్‌స్కై ఒప్పందం నుంచి అమెరికా వైదొలగిన సంఘటనలు ఉన్నాయి. ఈ విధంగా ప్రపంచంలో అణ్వాస్త్ర ప్రమాదానికి దోహదం చేస్తున్నది అమెరికాయే. ఇజ్రాయెల్ దగ్గర 200కు పైగా అణ్వాస్త్రాలున్నా అణ్వాయుధాల వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పిటి)పై సంతకం చేయకపోవడం గమనార్హం. 2018లో జెసిపిఒఎ (జాయింట్ కాంప్రెహెన్సివ్ ప్లాన్ ఆఫ్ యాక్షన్) అనే అణు ఒప్పందంలో ఇరాన్‌తోపాటు అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, రష్యా, చైనా, యూరోపియన్ యూనియన్ పాలుపంచుకున్నాయి. అయితే ఈ ఒప్పందం సరిగ్గా అమలు కావడం లేదన్న సాకుతో ట్రంప్ వైదొలిగారు. దీంతో ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు పెరిగాయి. ఇరాన్ తర్వాత ఒప్పందంలో అనుమతించిన దానికంటే ఎక్కువ స్థాయిలో యురేనియం శుద్ధి చేయడం ప్రారంభించింది. అణ్వాయుధ నియంత్రణ ఒప్పందాలు ప్రపంచాన్ని మరింత సురక్షితంగా మార్చాయని చరిత్ర నిరూపిస్తోంది. కానీ అగ్రరాజ్యం వైఖరి ఒప్పందానికి కట్టుబడడం లేదు. పైగా ఇరాన్ తదితర ప్రత్యర్థి దేశాలకు హెచ్చరిస్తున్నట్టు అనేక వ్యూహాలను రూపొందిస్తోంది. దీనికి ఉదాహరణంగా ఇటీవల సౌదీ అరేబియాతో అమెరికా కుదుర్చుకున్న ఒప్పందమే ఒక వ్యూహం. దీని ప్రకారం సౌదీ అరేబియా తన స్వంతగడ్డపై యురేనియంను సుసంపన్నం చేసుకునే సామర్థంతో పౌర అణు కార్యక్రమాన్ని అభివృద్ధి చేసుకోవడానికి వెసులుబాటు కల్పించింది. ఈ ఒప్పందం ద్వారా సౌదీలో అమెరికా కంపెనీలు అణుపరిశ్రమల నిర్మాణం మరింత సులభమౌతుంది. సౌదీ అరేబియాకు దూరంగా ఉన్న ఇజ్రాయెల్‌ను కూడా ఈ సందర్భంగా సౌదీకి ట్రంప్ చేరువ చేశారు. ఇరాన్ అణుసామర్థ్యాన్ని నివారించడానికి విశ్వప్రయత్నం చేస్తున్న అమెరికా అణుపరీక్షలు కొనసాగించడానికి సిద్ధమవుతోంది. అణ్వాయుధాలు సరిగ్గా పనిచేస్తున్నాయో లేదో తిరిగి పరీక్షించుకోడానికే ఇదంతా అని సమర్థించుకుంటోంది. ఇరాన్‌తో యుద్ధం సాగిస్తుండడంతో అమెరికా వద్ద క్షిపణి నిల్వలు పడిపోతుండడం అధ్యక్షుడు ట్రంప్‌కు ఆందోళన కలిగిస్తోంది. అమెరికా వినియోగిస్తున్న ఒక్కో క్షిపణి ధర 1.5 మిలియన్ డాలర్లకు మించి విలువైనవి. ఇంత వ్యయం అమెరికా భరించడం ఎవరి క్షేమం కోసమో అర్థం కావడం లేదు.

# లోతైన సంక్షోభంలో విద్యా వ్యవస్థ!

ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ప్రజాభిప్రాయానికి స్పందించాల్సిన బాధ్యత కలిగి ఉంటాయి. బాధ్యత అనేది రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యానికి మూలస్తంభం. అయితే అది కేవలం మంత్రి రాజీనామాతో ముగియకూడదు. పరీక్షల నిర్వహణ సంస్థలు, నియామక సంస్థలు, పోలీసు దర్యాప్తు యంత్రాంగం, సైబర్ భద్రతా వ్యవస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, పోటీ పరీక్షల నిర్వహణలో భాగస్వాములైన అన్ని పరిపాలనా సంస్థలకు కూడా సమానంగా వర్తించాలి. సంస్థాగత బాధ్యత లేకుండా రాజకీయ బాధ్యత ప్రతీకాత్మకంగానే మిగిలిపోతుంది. విద్యార్థులపై జరిగిన పోలీసు చర్య ప్రజాస్వామ్య పాలనలో మరో కీలక కోణాన్ని గుర్తుచేస్తుంది. శాంతియుత నిరసన వ్యక్తం చేయడం ప్రతి పౌరుని రాజ్యాంగబద్ధ హక్కు. అదే సమయంలో చట్టం, శాంతి భద్రతలను కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాను కేవలం ఒక వ్యక్తి రాజకీయ పరాజయంగా మాత్రమే చూడకూడదు. అది భారత విద్యా వ్యవస్థలో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోతున్న లోతైన సంస్థాగత సంక్షోభానికి ప్రతీకగా భావించాలి. ఈ రాజీనామా ప్రజా ఒత్తిడితో జరిగిందా, రాజకీయ వ్యూహంలో భాగమా అన్నది పక్కన పెడితే, విద్యార్థులు లేవనెత్తిన ప్రధాన ప్రశ్నలకు ఇంకా సమాధానాలు లభించలేదు. భారతదేశం తన పరీక్షా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని తిరిగి నెలకొల్పగలదా? బాధ్యత అనేది కేవలం రాజకీయ త్యాగాలకు మాత్రమే పరిమితమవుతుందా? మౌనంగా ఉండేందుకు నిరాకరిస్తున్న యువత ఆకాంక్షలకు పాలన అనుగుణంగా మారగలదా? విద్యార్థుల ఉద్యమం ఒక చారిత్రక విజయాన్ని సాధించింది. మంత్రి రాజీనామా ప్రజాస్వామ్య పోరాటానికి నైతిక విజయమే అయినప్పటికీ, ఒక వ్యక్తిని మార్చడం ద్వారా వ్యవస్థాగత లోపాలు తొలగిపోతాయని భావించడం సరళీకరణ అవుతుంది. ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షలలో అక్రమాలు, పరిపాలనా పారదర్శకత లోపం, విద్యాసంస్థలపై తగ్గుతున్న విశ్వాసం వంటి సమస్యలు దశాబ్దాలుగా పేరుకుపోయిన నిర్మాణాత్మక వైఫల్యాలు. ఒక రాజీనామాతో అవి అంతరించిపోవు. ఈ ఉద్యమంలో అత్యంత విశేషమైన అంశం జనరేషన్ –జెడ్ ఒక స్వతంత్ర రాజకీయ శక్తిగా అవతరించడం. గతంలో విద్యార్థి ఉద్యమాలు రాజకీయ పార్టీల ఆధిపత్యంలో నడిచినప్పటికీ, ఈ ఉద్యమం డిజిటల్ సమీకరణ, వికేంద్రీకృత నాయకత్వం, సమస్యల ఆధారిత రాజకీయాల చుట్టూ రూపుదిద్దుకుంది. నేటి యువతకు సిద్ధాంత నినాదాల కంటే విద్యా న్యాయం, ఉపాధి అవకాశాలు, పారదర్శక పరిపాలన వంటి అంశాలే ముఖ్యంగా మారాయి. ఇది భారత ప్రజాస్వామ్యంలో భాగస్వామ్య స్వరూపం మారుతున్నదనడానికి నిదర్శనం. ఈ నిరసనలు పరీక్షా సంస్కరణలకే పరిమితం కాకుండా, యువతలో పెరుగుతున్న అసంతృప్తికి ప్రతీకగా



మారాయి. నిరుద్యోగం, ఉద్యోగ అవకాశాలపై అనిశ్చితి, వరుసగా జరుగుతున్న పరీక్షా అవకతవకలు, ప్రభుత్వ సంస్థలపై తగ్గుతున్న నమ్మకం –ఇవన్నీ కలిసి యువతలో తీవ్ర నిరాశను కలిగించాయి. అందువల్ల ఈ ఉద్యమం ఒక పరీక్ష గురించి మాత్రమే కాకుండా, ఒక తరం భవిష్యత్తు గురించి సాగిన పోరాటంగా మారింది. ఈ పరిణామం రాజకీయ బాధ్యత గురించి కూడా ఒక ముఖ్యమైన ప్రశ్నను లేవనెత్తింది. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ప్రజాభిప్రాయానికి స్పందించాల్సిన బాధ్యత కలిగి ఉంటాయి. బాధ్యత అనేది రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యానికి మూలస్తంభం. అయితే అది కేవలం మంత్రి రాజీనామాతో ముగియకూడదు. పరీక్షల నిర్వహణ సంస్థలు, నియామక సంస్థలు, పోలీసు దర్యాప్తు యంత్రాంగం, సైబర్ భద్రతా వ్యవస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, పోటీ పరీక్షల నిర్వహణలో భాగస్వాములైన అన్ని పరిపాలనా సంస్థలకు కూడా సమానంగా వర్తించాలి. సంస్థాగత బాధ్యత లేకుండా రాజకీయ బాధ్యత ప్రతీకాత్మకంగానే మిగిలిపోతుంది. విద్యార్థులపై జరిగిన పోలీసు చర్య ప్రజాస్వామ్య పాలనలో మరో కీలక కోణాన్ని గుర్తుచేస్తుంది. శాంతియుత నిరసన వ్యక్తం చేయడం ప్రతి పౌరుని రాజ్యాంగబద్ధ హక్కు. అదే సమయంలో చట్టం, శాంతి భద్రతలను కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. ఈ రెండింటి మధ్య సమతుల్యతను పాటిస్తూ, పోలీసు చర్యలు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, పౌరహక్కులను గౌరవించే విధంగా ఉండాలి. ప్రజాస్వామ్యం విభేదాలను అణచివేయడం వల్ల కాదు; ప్రజల ఆందోళనలను నిర్మాణాత్మకంగా వినడం వల్ల బలపడుతుంది. సామాజిక మాధ్యమాల పాత్ర కూడా ఎంతో పెరిగింది. మీమ్స్, వ్యంగ్య చిత్రాలు, డిజిటల్ ప్రచారాలు ప్రజల దృష్టిని ఆకర్షించే శక్తివంతమైన సాధనాలుగా మారాయి. అయితే అవి సంక్లిష్టమైన విధాన చర్చలను అతిగా సరళీకరించే ప్రమాదం కూడా ఉంది. ప్రజాభిప్రాయం వైరల్ కథనాల కంటే ఆధారాలతో కూడిన సమాచారంపై ఆధారపడాలి. అదే విధంగా, ఇ–20 ఇథనాల్ మిశ్రమ ఇంధనం చుట్టూ జరిగిన చర్చలు ప్రజల విశ్వాసం పారదర్శకమైన శాస్త్రీయ సమాచారంపై ఆధారపడుతుందని స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ, ఇంధన భద్రత, సాంకేతిక మార్పులకు సంబంధించిన ప్రభుత్వ విధానాలు నిరంతర ప్రజా చర్చకు లోనవ్వాలి. ప్రజలకు ప్రయోజనాలు, ఖర్చులు, దీర్ఘకాలిక ప్రభావాలపై స్పష్టమైన ఆధారాలతో కూడిన సమాచారం అందించాలి. ఈ రాజీనామా భారత రాజకీయాల్లో ఒక మలుపుగా నిలుస్తుందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ప్రజల నిరంతర ఒత్తిడి ప్రభుత్వాలను తమ నిర్ణయాలను పునఃపరిశీలించడానికి దారితీయగలదనే విషయాన్ని ఇది సూచిస్తుందని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే దీనిపై తుది తీర్పు భవిష్యత్ రాజకీయ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది. ప్రజాస్వామ్య చరిత్రలో ఇటువంటి సంఘటనలు కాలక్రమేణా పౌరులు, –ప్రభుత్వాల సంబంధాన్ని పునర్నిర్వచిస్తాయి. అత్యంత ముఖ్యంగా, భారత విద్యా సంక్షోభం ప్రశ్నాపత్రాల లీకులతో మాత్రమే పరిమితం కాదు. పరీక్షల వాయిదాలు, నియామకాల ఆలస్యం, విద్యాసంస్థల్లో ఖాళీలు, ఉన్నత విద్యలో తగిన పెట్టుబడుల కొరత, విద్యా రంగం వాణిజ్యీకరణ– ఇవన్నీ కలిసి విద్యార్థుల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. విద్యా పరిపాలనలో సమగ్ర సంస్కరణలు లేకుండా పరీక్షా సంస్కరణలు మాత్రమే ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించలేవు. భారతదేశానికి అత్యవసరంగా సమగ్ర పరీక్షా సమగ్రత వ్యవస్థ అవసరం. సురక్షితమైన డిజిటల్ మౌలిక వసతులు, స్వతంత్ర పరీక్షా నియంత్రణ సంస్థలు, బలమైన సైబర్ భద్రతా వ్యవస్థలు, నియామక ప్రక్రియల పారదర్శక ఆడిట్లు, పరీక్షా మోసాలపై వేగవంతమైన న్యాయ చర్యలు, సమాచార బహిర్గతం చేసే వ్యక్తులకు రక్షణ, పోటీ పరీక్షలకు దేశవ్యాప్తంగా ఏకరీతి ప్రమాణాలు ఏర్పాటు చేయాలి. అలాగే తీవ్రమైన విద్యా ఒత్తిడిని ఎదుర్కొంటున్న విద్యార్థులకు మానసిక సలహా, సహాయక వ్యవస్థలను బలోపేతం చేయాలి. చివరికి, ఏ విద్యార్థి ఉద్యమానికైనా నిజమైన విజయాన్ని కేవలం ఒక మంత్రి రాజీనామాతో కొలవలేం. అది శాశ్వతమైన సంస్థాగత సంస్కరణలకు దారితీస్తే చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది. రాజకీయ విజయాలు తాత్కాలికం; నిర్మాణాత్మక సంస్కరణలే శాశ్వత మార్పును తీసుకువస్తాయి. ఈ పరిణామాలు విధాన నిర్ణేతలకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తున్నాయి. విద్య అనేది కేవలం పరిపాలనా రంగం కాదు; అది కోట్లాది భారత యువత కలలు, ఆశయాలు, భవిష్యత్తుకు ప్రతీక. పరీక్షా వ్యవస్థ విశ్వసనీయతను పునరుద్ధరించడం, పాలనలో పారదర్శకత పెంపొందించడంలో, విద్యార్థుల రాజ్యాంగబద్ధ హక్కులు రక్షించడం, ప్రజల విశ్వాసాన్ని తిరిగి నెలకొల్పడం జాతీయ ప్రాధాన్య అంశాలు మారాలి. అప్పుడే భారతదేశం ప్రజల ఆగ్రహాన్ని అర్థవంతమైన విద్యా సంస్కరణలు, ప్రజాస్వామ్య పునరుజ్జీవనంగా మార్చగలదు.

# సముద్ర మథనం భారత భవిష్యత్తుకు అమృతమా?

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో శక్తివనరులే దేశాల అభివృద్ధికి ప్రధాన చోదకశక్తిగా మారాయి. చమురు, సహజవాయువు, అరుదైన ఖనిజాలు, సముద్ర గర్భంలోని విలువైన వనరులు ఇప్పుడు ప్రపంచ దేశాల మధ్య పోటీకి కేంద్రబిందువుగా నిలుస్తున్నాయి. ఒకప్పుడు 'సముద్ర మథనం' అనే పదం పురాణాల్లో మాత్రమే వినిపించేది. నేడు అదే పదం ఆధునిక ఆర్థిక వ్యవస్థలో కొత్త అర్థాన్ని సంతరించుకుంది. సముద్ర గర్భంలోని సంపదను వెలికితీసి దేశ ఆర్థికాభివృద్ధికి వినియోగించుకోవడమే నేటి 'సముద్ర మంథనం'. ఈ నేపథ్యంలో సముద్రంలో చమురు, సహజవాయువు అన్వేషణ, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సుమారు రూ. 84 వేల కోట్ల విలువైన 'డీప్‌వాటర్ ఎనర్జీ మిషన్'కు ఆమోదం తెలపడం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నిర్ణయం భారత ఇంధన భద్రతకు మాత్రమే కాకుండా, భవిష్యత్ ఆర్థిక స్వావలంబనకు కూడా కీలక అడుగుగా చెప్పవచ్చు. భారత్ ప్రస్తుతం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఇంధన వినియోగ దేశం. కానీ వినియోగించే ముడి చమురులో దాదాపు 85 శాతం విదేశాలనుంచే దిగుమతి చేసుకుంటోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరిగినా, యుద్ధాలు జరిగినా, సరఫరా వ్యవస్థ దెబ్బతిన్నా భారత ఆర్థిక వ్యవస్థపై ప్రత్యక్ష ప్రభావం పడుతోంది. విదేశీ మారకద్రవ్యం భారీగా ఖర్చవుతోంది. దిగుమతులపై అధిక ఆధారపడటం దేశ ఆర్థిక స్థిరత్వానికి సవాలుగా మారుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో దేశ సముద్ర జలాల్లోనే చమురు, సహజవాయువు నిల్వలను గుర్తించి ఉత్పత్తిని పెంచగలిగితే దిగుమతులపై ఆధారపడే పరిస్థితి క్రమంగా తగ్గుతుంది. దీనివల్ల విదేశీ మారక నిల్వలు ఆదా కావడంతోపాటు దేశఇంధన భద్రత మరింత బలపడుతుంది. భారతదేశానికి దాదాపు 7,500 కిలోమీటర్ల పొడవైన తీరప్రాంతం ఉంది. అరేబియా సముద్రం, బంగాళాఖాతం, హిందూ మహాసముద్ర పరిధిలో అపారమైన సహజ వనరులు ఉన్నాయని నిపుణులు చాలాకాలంగా చెబుతున్నారు. ఇప్పటికే ముంబై హై వంటి ప్రాంతాల్లో చమురు ఉత్పత్తి జరుగుతోంది. అయితే సముద్ర గర్భంలోని మరింత లోతైన ప్రాంతాల్లో ఉన్న నిల్వలను వెలికితీయడానికి అత్యాధునిక సాంకేతికత, భారీ పెట్టుబడులు అవసరం. అందుకే కేంద్ర ప్రభుత్వం ఈ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించే విధానాలను రూపొందిస్తోంది. ఈ కార్యక్రమం విజయవంతమైతే



అనేక ప్రత్యక్ష, పరోక్ష ప్రయోజనాలు కలుగుతాయి. మొదటిగా దేశఇంధన ఉత్పత్తి పెరుగుతుంది. రెండవది, వేలాది మందికి ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. సముద్ర అన్వేషణ, డ్రిల్లింగ్, ఇంజినీరింగ్, నౌకాయానం, లాజిస్టిక్స్, పరిశోధన వంటి అనుబంధ రంగాల్లో నైపుణ్యం కలిగిన మానవ వనరులకు భారీ డిమాండ్ ఏర్పడుతుంది. మూడవది, దేశీయ పరిశ్రమలకు స్థిరమైన ఇంధన సరఫరా లభించడంవల్ల తయారీ రంగం మరింత వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. ఇక వ్యూహాత్మకంగా కూడా ఈ నిర్ణయం ఎంతో ప్రాధాన్యమైంది. ప్రపంచంలో రష్యా– ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు వంటి పరిణామాలు చమురు సరఫరా గొలుసులను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఇలాంటి పరిస్థితుల్లో స్వదేశీ ఉత్పత్తిని పెంచుకోవడం జాతీయ భద్రత కోణంలో కూడా అత్యంత అవసరం. శక్తి స్వావలంబన సాధించిన దేశాలే దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడగలవని గత కొన్ని సంవత్సరాల అనుభవం స్పష్టం చేసింది. అయితే ఈ సముద్ర మథనం అంత సులభమైన ప్రక్రియ కాదు. లోతైన సముద్రంలో డ్రిల్లింగ్ చేయడం అత్యంత ఖరీదైన పని. సాంకేతికంగా క్లిష్టమైనది కూడా. ఒక బావిని తవ్వడానికి వేల కోట్ల రూపాయల పెట్టుబడి అవసరం కావచ్చు. అంతేకాకుండా ప్రతి అన్వేషణ విజయవంతమవుతుందనే హామీ ఉండదు. అందువల్ల ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ కంపెనీలు, విదేశీ సాంకేతిక భాగస్వాముల మధ్య సమన్వయం ఎంతో కీలకం. పర్యావరణ పరిరక్షణ కూడా ఇదే స్థాయిలో ప్రాధాన్యం పొందాలి. సముద్రంలో చమురు లీకేజీలు, రసాయన కాలుష్యం, సముద్ర జీవవైవిధ్యానికి నష్టం వంటి ప్రమాదాలను ఏమాత్రం విస్మరించరాదు. ప్రపంచంలో గతంలో జరిగిన కొన్ని చమురు ప్రమాదాలు సముద్ర పర్యావరణంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపించాయి. కాబట్టి ఆధునిక భద్రతా ప్రమాణాలు, కఠినమైన పర్యావరణ నియంత్రణలు, నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి. అదే విధంగా తీరప్రాంతాల్లో నివసించే మత్స్యకారుల జీవనోపాధిని కూడా ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోవాలి. సముద్ర అన్వేషణ పేరుతో వారి చేపల వేటకు ఆటంకం కలగకుండా చూడాలి. అవసరమైతే తగిన పరిహారం, ప్రత్యామ్నాయ ఉపాధి, సామాజిక భద్రత కల్పించాలి. అభివృద్ధి ప్రజల జీవితాలను మెరుగుపరచేదిగా ఉండాలి గానీ, వారి జీవనోపాధిని దెబ్బతీసేదిగా మారకూడదు. ఇంధన రంగంలో ప్రపంచం క్రమంగా పునరుత్పాదక శక్తి వనరుల వైపు అడుగులు వేస్తున్నప్పటికీ, చమురు, సహజవాయువు ప్రాధాన్యం ఇంకా దశాబ్దాలపాటు కొనసాగుతుందని అంచనాలు సూచిస్తున్నాయి. అందువల్ల ఒకవైపు సౌర, పవన, గ్రీన్ హైడ్రోజన్ వంటి ప్రత్యామ్నాయ శక్తి వనరులను అభివృద్ధి చేస్తూనే, మరోవైపు దేశీయ చమురు, గ్యాస్ ఉత్పత్తిని పెంచడం సమతుల్య ఇంధన విధానంగా భావించవచ్చు. పురాణాల్లో సముద్ర మథనం ద్వారా అమృతం లభించినట్లు చెబుతారు. నేటి శాస్త్రీయ యుగంలో సముద్ర మథనం ద్వారా లభించేది అమృతం కాదు; ఇంధన భద్రత, ఆర్థిక స్వావలంబన, సాంకేతిక పురోగతి, ఉపాధి అవకాశాలు, వ్యూహాత్మక బలం. అయితే ఈ అమృతం లభించాలంటే దూరదృష్టితో కూడిన విధానాలు, పారదర్శక పరిపాలన, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణ పరిరక్షణ– ఈ నాలుగు స్తంభాలు తప్పనిసరిగా బలంగా ఉండాలి. సాగరంలో ఇంధనం కోసం చేపట్టే ఈ సముద్ర మథనం కేవలం చమురు వెలికితీత కార్యక్రమం మాత్రమే కాదు. ఇది భారత ఆర్థిక భవిష్యత్తును మరింత బలపరిచే వ్యూహాత్మక ప్రయాణం. సరైన ప్రణాళిక, సమర్థవంతమైన అమలు, పర్యావరణ సమతుల్యతతో ముందుకు సాగితే ఈ మథనం భారత అభివృద్ధికి నిజమైన అమృతాన్ని అందించే అవకాశాలు ఎంతో ప్రకాశవంతంగా కనిపిస్తున్నాయి.

# ఆర్థిక సహాయం అందజేత.



**మల్లాపూర్ ఆగస్టు 07; నవ సంఘర్షణ**
మండలం లో ని మొగిలిపేట గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికుడు శ్రీ కొత్తూరి రాజం అనారోగ్యంతో మరణించడంతో వారి యొక్క కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ గ్రామపంచాయతీ పాలకవర్గం తరఫున 15000 ఆర్థిక సహాయం అందించడం జరిగింది సర్పంచ్ గోల్కొండ కళ రమేష్ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# హరిశంకర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**మేడిపల్లి, ఆగస్టు 07; నవ సంఘర్షణ**
విషాదంలో ఉన్న దొంతిరి సంజీవ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునిత మహేందర్ రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లా, మోటకొండూరు మండలం ఇక్కుర్తి గ్రామానికి చెందిన మేడిపల్లి మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి తండ్రి, దివంగత దొంతిరి సంజీవ రెడ్డి ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆలేరు మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్, బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ గొంగిడి సునిత మహేందర్ రెడ్డి ఇక్కుర్తిలోని వారి నివాసానికి వెళ్లారు.సంజీవ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించిన ఆమె, అనంతరం శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి తీవ్ర సానుభూతి తెలిపారు. సంజీవ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు.

# మూడు బొమ్మల మేడిపల్లిలో వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి బోనాలు



**మెట్ పల్లి ఆగస్ట్ 7: నవ సంఘర్షణ**
మెట్‌పల్లి మండలంలోని మూడు బొమ్మల మేడిప ల్లి గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి బోనాల పండు గ ఘనంగా నిర్వహించబ డింది. ద్యావతి జంగా జ యప్రకాష్ రాజ్ ఆధ్వర్యం లో గ్రామ ప్రజలు ఈ వేడు కలను అంగరంగ వైభవం గా జరుపుకున్నారు. మ హిళలు భక్తిశ్రద్ధలతో బో నాలను శిరస్సున ధరించి, పోతురాజుల విన్యాసా లు, డప్పు చప్పుళ్ల మోత నడుమ ఊరేగింపుగా వెళ్లే దృశ్యం గ్రామంలో ఆధ్యా త్మిక వాతావరణాన్ని నిం పింది. ఈ సందర్భంగా అ మ్మవారికి బోనాలను నైవే ద్యంగా సమర్పించి, తమ గ్రామాన్ని, ప్రజలను చల్ల గా చూడాలని పూజలు నిర్వహించారు. ఈ వేడు కల్లో గ్రామ సర్పంచ్ కదరి రాజేష్, ఉప్ప సర్పంచ్ బం దిల గణేష్, వార్డు మెంబె ర్స్ పింజరి హరీష్, పిసు నరేష్, మేడిపల్లి బిఆర్ఎ స్ గ్రామ శాఖ అధ్యక్షులు పింజరి బొర్రయ్య, పింజరి రమేష్, బొబ్బిలి ప్రశాంత్, గ్రామ ప్రజలు, భక్తులు పె ద్ద సంఖ్యలో పాల్గొని అ మ్మవారి కృపకు పాత్రుల య్యారు.

# అమ్మ వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన జువ్వాడి నర్సింగరావు



**నవ సంఘర్షణ మెట్ పల్లి ఆగస్ట్ 7:**
ఆషాఢ మాసం బోనాల పండుగ సందర్భంగా మె ట్‌పల్లి పట్టణంలోని శ్రీ మ హాలక్ష్మమ్మ దేవాలయం లో శ్రావణ వాతావరణం, భక్తిశ్రద్ధల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వెల్మ కార్పొరే షన్ చైర్మన్ జువ్వాడి న ర్సింగరావు.మెట్‌పల్లి ము న్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి పాల్గొని అమ్మవా రికి పట్టు వస్త్రాలు, పూలు, పండ్లను సమర్పించి ప్రత్యే క మొక్కులు చెల్లించుకు న్నారు. అనంతరం భక్తుల కు అమ్మవారి ప్రసాద విత రణ చేశారు.ఈ సందర్భం గా నాయకులు మాట్లాడు తూ పట్టణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సిరి సంపదలతో వర్ధిల్లాలని అ మ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మున్సిప ల్ కమిషనర్ శ్రీనివాస్ గౌ డ్,మున్సిపల్ కౌన్సిల ర్లు, కోఆప్షన్ నెంబర్లు పార్టీ నా యకులు, కార్యకర్తలు, అ భిమానులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# 400 మీటర్ల పరుగు పందెంలో కార్తికేయ విజయం

**-ఒలింపియాడ్ స్కూల్ క్రీడా పోటీల్లో పారుపల్లి కార్తికేయకు ప్రథమ బహుమతి**

**-అభినందించిన పాఠశాల యాజమాన్యం, తాత, సీనియర్ పాత్రికేయుడు పారుపల్లి రాజలింగం**

**-శుభాకాంక్షలు తెలియజేసిన తాత నల్లగొండ సురేష్ హైదరాబాద్.**





**గోదావరిఖని, ఆగస్టు 07; నవ సంఘర్షణ**
: ఒలింపియాడ్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న పారుపల్లి కార్తికేయ క్రీడా రంగంలో మరోసారి తన ప్రతిభను చాటుకున్నాడు. పాఠశాల నిర్వహించిన క్రీడా పోటీల్లో 400 మీటర్ల పరుగుపందెంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతిని సొంతం చేసుకున్నాడు. చిన్ననాటి నుంచే చదువుతో పాటు క్రీడలపైనా ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్న కార్తికేయ, ప్రతి పోటీలో తనదైన ప్రతిభతో ముందంజలో నిలుస్తున్నాడు. తల్లిదండ్రులు పారుపల్లి నిఖిల్, హిమబిందు అతనిలోని ప్రతిభను గుర్తించి నిరంతరం ప్రోత్సహిస్తూ వస్తున్నారు. ముఖ్యంగా తండ్రి నిఖిల్ ప్రతిరోజూ క్రమశిక్షణతో స్పోర్ట్స్ ప్రాక్టీస్ చేయించడంతో కార్తికేయ పరుగుపందెంలో నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఈ విజయాన్ని సాధించాడు. పాఠశాలలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో ఇతర విద్యార్థులతో పోటీపడి 400 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలవడం ద్వారా తన ప్రతిభను మరోసారి నిరూపించుకున్నాడు. చిన్న వయసులోనే వేగవంతమైన రన్నర్‌గా గుర్తింపు పొందుతున్న కార్తికేయ భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రాణించే సామర్థ్యం కలిగిన క్రీడాకారుడిగా ఎదుగుతాడని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా కార్తికేయను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు, బంధుమిత్రులు ఘనంగా అభినందించారు. అతని తాత, సీనియర్ పాత్రికేయుడు పారుపల్లి రాజలింగం మనవడి విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ, ఇదే పట్టుదలతో సాధన కొనసాగించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు కూడా తమ కుమారుడి విజయానికి ఆనందం వ్యక్తం చేస్తూ, చదువుతో పాటు క్రీడల్లోనూ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. కార్తికేయ సాధించిన ఈ విజయం పాఠశాలకు గర్వకారణమని, ఇతర విద్యార్థులకు కూడా స్ఫూర్తిదాయకమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

# ఫ్రైడే -డ్రైడేను ప్రజలంతా పాటించాలి

**-ప్రముఖ సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి**



**మెట్ పల్లి ఆగస్టు 07; నవ సంఘర్షణ**
మల్లాపూర్ మండల కేం ద్రం లో 14 వ వార్డు లో శు క్రవారం 'ఫ్రైడే - డ్రై డే' కా ర్యక్రమం ఘనంగా నిర్వ హించారు.ఈ కార్యక్రమం లో ప్రముఖ సామాజిక కా ర్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భం గా వెంకట్ రెడ్డి మాట్లాడు తూ పరిసరాలు పరిశుభ్రం గా ఉంచుకోవడం ద్వారా డెంగ్యూ, మలేరియా, చిక న్‌గున్యా వంటి ప్రాణాంత క సీజనల్ వ్యాధుల నుం చి మనల్ని మనం కాపా డుకోవచ్చు.ఇళ్లలో మరి యు పరిసరాల్లో నీరు ని ల్వ ఉండకుండా చూసి, దోమల వృద్ధిని అరికట్టవ చ్చు,దోమలు పుట్టకుండా నివారించడం.వర్షాకాలంలో వచ్చే అంటువ్యాధుల ను అడ్డుకోవడం. ప్రజారో గ్యంపై అవగాహన పెంచ డం మనం చేయవలసిన పనులుప్రతి శుక్రవారం ఉ దయం 10 నిమిషాలు కే టాయించాలి.ఇళ్లలోని కూలర్లు, పూలకుండీలు, పాత ట్యూబ్‌లు, డబ్బాల లో నిల్వ ఉన్న నీటిని తొ లగించాలి.నీటి ట్యాంకు లు మరియు తొట్టెలను మూతలతో భద్రంగా ఉం చాలి.ఇళ్ల చుట్టూ ఉన్న మురుగునీరు నిల్వకుండా శు భ్రంచేసుకోవాలి.దోమల కాటు ద్వారా మలేరియా, డెంగ్యూ లాంటి ప్రమాదక ర జ్వరాలు ప్రబలుతాయి. ప్రభుత్వాలు, స్థానిక సం స్థల పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను ప రిశు భ్రంగా ఉంచుకోవాలి అని అన్నారు.ఈ కార్యక్ర మం లో 14 వ వార్డు స భ్యురాలు ఏనుగు లక్ష్మి, ఆశా కార్యకర్తలు ముద్దం సరిత, లీలా రాణి, తది తరులు పాల్గొన్నారు.

# దోమల నివారణకు ముందస్తు ఫాగింగ్

**-పన్నూర్ గ్రామ సర్పంచ్ చిందం మహేష్**



**రామగిరి,ఆఆగస్టు 07; నవ సంఘర్షణ**
రామగిరి మండలం,పన్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో వర్షాకాలంలో దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ,మలేరియా,చికున్‌గున్యా వంటి వ్యాధులను నివారించేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా గత మూడు రోజులుగా ప్రతిరోజూ అర్ధరాత్రి గ్రామ సర్పంచ్ చిందం మహేష్ ఫాగింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.పన్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో పన్నూర్ సెంటినరి కాలనీ లోని జోన్-1,జోన్-2,టీ -2,శ్రీలంక,క్వార్టర్స్, వకీల్‌పల్లె,శివరాం నగర్,విద్యానగర్ ప్రాంతాల్లో ఫాగింగ్ మెషిన్ సహాయంతో విస్తృతంగా ఫాగింగ్ చేపట్టి దోమల నివారణ చర్యలు చేపట్టారు. పన్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పన్నూర్ సెంటినరీ కాలనీలోని జోన్-1,జోన్-2,టీ-2 క్వార్టర్స్,శ్రీలంక క్వార్టర్స్,వకీల్‌పల్లె,శివరాం నగర్,విద్యానగర్ ప్రాంతాల్లో ఫాగింగ్ మెషిన్ సహాయంతో విస్తృతంగా ఫాగింగ్ నిర్వహించి దోమల నివారణ చర్యలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కావేటి మల్లేశ్వరి,వార్డ్ సభ్యులు రమాదేవి,అరుణ, వైష్ణవి,రఘుపతి, ప్రశాంత్,ప్రదీప్,గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొని ఫాగింగ్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# పిఆర్సిని వెంటనే ప్రకటించాలి

**-యూఎస్పిసి డి మాండ్.**

**-నల్ల బ్యాడ్జీలతో నిరసన**

**-ఉద్యమాన్ని మరింత ఉ ధృతం చేస్తామని హెచ్చరిక**

**-పిఆర్సినీ వెంటనే ప్రకటిం చి బాకీ ఉన్న ఆరు డిఎ ల ను వెంటనే విడుదల విడు దల చేయాలని యుఎస్పి సి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.**




**మెట్ పల్లి ఆగస్టు 07; నవ సంఘర్షణ**
రాష్ట్రంలోని ఉపాధ్యా య, విద్యారంగా సమస్య ల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా యూఎస్పిసి ఆ ధ్వర్యంలో చేపట్టిన నిరస న కార్యక్రమంలో బాగంగా కోరుట్ల డివిజన్ కేంద్రం లోనీ అన్ని పాఠశాలల్లో ఉ పాధ్యాయులు నల్ల బ్యాడ్జీ లు ధరించి నిరసన చేప ట్టారు.ఉపాధ్యాయ, వి ద్యార్థి సమస్యలతో పా టు, జీ వో నంబరు ఇరవై ఐదును సవరించాలని డి మాండ్ చేశారు.పిఆర్సి ప్ర కటించని యెడల ఈనెల 29న రాష్ట్ర రాజధాని హై దరాబాదులో పెద్ద ఎత్తు లోమహాధర్నా నిర్వహిం చనున్నమని, అయినప్ప టికీ ప్రభుత్వం స్పందించ ని యెడల సెప్టెంబర్లో అ సెంబ్లీ ముట్టడి చేపట్టడా నికి వెనకడమని హెచ్చరిం చారు.కార్యక్రమంలోయూఎస్పిసి నాయకులు తిరు కోవెల శ్యామ్ సుందర్, గ ట్ల సంతోష్, వడ్లకొండ గం గాధర్, గంగమోహన్, నా గరాజు, లక్ష్మీనారాయణ, రవూఫ్, రాధిక,దివ్య, సు మలత, హేమలత, సు జాత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# బోర్ బావి కి భూమి పూజ



**మెట్ పల్లి ఆగస్టు 07; నవ సంఘర్షణ**
మల్లాపూర్ మండల కేం ద్రం లో ఒడ్డెర కాలనీ లో పాఠశాల లో మంచినీటి సమస్యతో విద్యార్థులు ఇ బ్బంది పడుతున్నారని భావించి జువ్వాడి కృష్ణా రావు సహకారం తో గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో బోరుబావి కి భూమి పూజ చేసారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ చి ట్యాల లక్ష్మణ్, ఉప సర్పం చ్ గడ్డం సోమ రెడ్డి, కాంగ్రె స్ పార్టీ మండల అధ్యక్షు లు మాట్ల సోమయ్య, జి ల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్య క్షులు పూంద్ర శ్రీనివాస్ రె డ్డి,మాజీ వన సంరక్షణ స మితి చైర్మన్ సిరిపురం ర వీందర్, కాంగ్రెస్ నాయకు లు కోటగిరి ఆనంద్ గౌడ్, మరిపెల్లి మల్లయ్య, పెరు మాండ్ల రాజేందర్ గౌడ్, వార్డు సభ్యులు ఏనుగు లక్ష్మి,అరికుప్పల చిన్న రా జం,ముష్కరి రమేష్, భు క్యా శేఖర్, ముత్యాల గం గా రాజం,శనిగారపు నరే ష్,అల్లె చంద్రయ్య, కదు ర్క రాజేందర్,సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొ న్నారు.

# చిల్వేర్ డ్రై డే కార్యక్రమం లో పాల్గొన్న సర్పంచ్ బోల్గం నాగరాజుగౌడ్

**మిడ్జిల్, ఆగస్టు 07; నవ సంఘర్షణ**
మిడ్జిల్ మండలంలోని చిల్వేర్ గ్రామ సర్పంచ్ నాగరాజుగౌడ్ ఇళ్ల పరిసరాలు, నీటి నిల్వ ప్రదేశాలను పరిశీలించి, నిల్వ ఉన్న నీటిని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టి, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాదేపల్లి మార్కెట్ డైరెక్టర్ సత్యం గౌడ్, మల్లేష్, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు

# థాయ్‌ల్యాండ్ స్కూల్‌లో కాల్పులు..



**బ్యాంకాక్: , ఆగస్టు 7: నవ సంఘర్షణ**
థాయ్‌ల్యాండ్ రాజధాని బ్యాంకాక్ శివారు ప్రాంతంలో ఉన్న డెబ్‌సిరిన్ నాన్తబురి స్కూల్‌లో ఇవాళ కాల్పుల ఘటన చోటుచేసుకున్నది. 9వ గ్రేడ్ చదువుతున్న ఓ విద్యార్థి కాల్పులకు తెగించాడు. ఈ ఘటనలో ఆ షూటర్‌తో పాటు మరో టీచర్ మృతిచెందినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అయితే మృతుల సంఖ్యను ఇప్పుడే నిర్ధారించలేమని జిల్లా పోలీసు అధికారి లెఫ్టినెంట్ కల్నల్ పాసాకార్న్ చైత్వావివాంగ్ తెలిపారు. నాన్తబురి ప్రావిన్సులో ఉన్న బంగ్ కురాయి జిల్లాలో ఈ ఘటన జరిగింది. కాల్పులు జరిపిన షూటర్‌ను విద్యార్థిగా పోలీసులు తేల్చారు. కానీ పూర్తి వివరాలను ఇంకా వెల్లడించలేదు.కాల్పుల ఘటన సమయంలో స్కూల్‌కు ఎమర్జెన్సీ వర్కర్లు చేరుకున్నారు. అంబులెన్సులు కూడా వచ్చాయి. గాయపడ్డ విద్యార్థులకు మెడిక్స్ చికిత్సను అందిస్తున్నారు. డెబ్‌సిరిన్ స్కూల్‌కు చాలా ప్రత్యేకత ఉన్నది. ప్రఖ్యాత సెకండరీ స్కూల్‌గా గుర్తింపు ఉంది. ఆ స్కూల్‌కు దేశంలో అనేక చోట్ల బ్రాంచీలు ఉన్నాయి. అయితే షూటింగ్ ఘటన జరిగిన నాన్తబురి బ్రాంచీ.. బ్యాంకాక్ శివారం ప్రాంతంలో ఉంటుంది. 1885లో థాయ్ చక్రవర్తి చులాలాంగ్‌కార్న్ .. డెబ్‌సిరిన్ స్కూల్‌ను స్థాపించారు. ఈ స్కూల్లో చాలా మంది ఫేమస్ పర్సనాల్టీలు చదువుకున్నారు.

# రాహుల్ ప్రయాగ్‌రాజ్ సభకు అనుమతి



**న్యూఢిల్లీ, , ఆగస్టు 7: నవ సంఘర్షణ**
ఆగస్టు 8న ప్రయాగ్‌రాజ్‌లో రాహుల్ గాంధీ తలపెట్టిన 'ఛాత్రోన్ కీ గూంజ్' (విద్యార్థుల గళం)సభకు యోగీ సర్కారు అనుమతిచ్చింది. పేపర్ లీకులు, నిరుద్యోగంపై విద్యార్థులతో రాహుల్ గాంధీ ఈసభలో ముఖాముఖి చర్చించనున్నారు. అయితే ముందుగా సభా వేదిక అయిన కేపీ గ్రౌండ్‌కు గతంలో ఇచ్చిన అనుమతిని రద్దు చేసి తీవ్ర ఉత్కంఠకు కారణమైన కాయస్థ పాఠశాల (కేపీ) ట్రస్ట్.. గురువారం అర్ధరాత్రి వెనక్కి తగ్గింది. కొన్ని షరతులతో సభ నిర్వహణకు మళ్లీ అనుమతి ఇస్తున్నట్లు ప్రకటించింది. సదస్సుకు పర్మిషన్ రావడంతో కాంగ్రెస్ శ్రేణులు సభా ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8:30 గంటల వరకు కేపీ గ్రౌండ్‌లో వేలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ యువతతో నేరుగా సంభాషిస్తారు రాహుల్ గాంధీ.

# నిజాయితీ ఉంటే అమిత్ షాతో రాజీనామా చేయించండి

**మోహన్ భాగవత్ కు కేసీ వేణుగోపాల్ సవాల్**



**న్యూఢిల్లీ, , ఆగస్టు 7: నవ సంఘర్షణ**
రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ ఇటీవల జెన్ -జీపై చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ శుక్రవారం తీవ్రంగా స్పందించారు. యువత పట్ల ఆయనకు నిజంగా నిజాయితీ ఉంటే, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేత రాజీనామా చేయించాలని సవాల్ విసిరారు. అంతేకాదు ప్రస్తుతం ప్రభుత్వాన్ని ఆర్ఎస్ఎస్ నడిపిస్తోందని, కనుక నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై ఇటీవల జరిగిన పోలీసు చర్యకు ఆ సంస్థే బాధ్యత వహించాలని అన్నారు.ప్రభుత్వాన్ని ఆర్ఎస్ ఎస్ నియంత్రిస్తోంది. వారికి జెన్? జీ యువతపై నిజంగానే శ్రద్ధ ఉంటే, కేంద్ర హోంమంత్రిని రాజీనామా చేయమని మోహన్ భాగవత్ అడగాలి. లేదంటే కనీసం పార్లమెంట్‌కు వచ్చి విద్యార్థులకు, అలాగే ప్రధానమంత్రికి క్షమాపణలు చెప్పాలి. విద్యార్థుల పట్ల ఆయనకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా, పెల్లెట్? గన్స్?, లాఠీఛార్జ్ రూపంలో విద్యార్థులపై జరిగిన అణచివేతను ఆయన ఖండించాలి. కానీ దీనిపై ఆయన ఎందుకు మౌనంగా ఉన్నారు? ఇవన్నీ కేవలం కంటితుడుపు చర్యలు మాత్రమేనని అన్నారు.

# విషమంగా మొజ్తబా ఖమేనీ ఆరోగ్యం



**జెరూసలేం , ఆగస్టు 7: నవ సంఘర్షణ**
ఇరాన్ అత్యున్నత నేత మొజ్తబా ఖమేనీ ఆరోగ్యం విషమంగా ఉందని, ఆయనను హుటాహుటిన దవాఖానకు తరలించారని ఇజ్రాయెల్ మీడియా సంస్థలు శుక్రవారం వెల్లడించాయి. చానల్ 14 (సీ14), జెరూసలేం పోస్ట్ కథనాల ప్రకారం ఖమేనీ పరిస్థితి అత్యంత విషమంగా ఉంది.ఖమేనీ సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రజల ముందుకు రాలేదు. లిఖితపూర్వక ప్రకటనలతోనే పాలనను సాగిస్తున్నారు. తన తండ్రి నివాసంపై జరిగిన దాడుల్లో మొజ్తబా తీవ్రంగా గాయపడ్డారని, అప్పటి నుంచి అజ్ఞాతంలో ఉంటూ రహస్య నెట్‌వర్క్‌తో అధికారులతో మాట్లాడుతూ పాలన నడుపుతున్నారని నివేదికలు పేర్కొన్నాయి.

# పరీక్షకు 3 రోజుల ముందే లీక్

**-ఒక్కో విద్యార్థి నుంచి 4 లక్షల వరకు వసూలు**
**-ఎన్‌టీఏ సబ్జెక్ట్ నిపుణులే ప్రధాన సూత్రధారులు**
**-నీట్ యూజీపై సీబీఐ చార్జిషీట్‌లో కీలకాంశాలు**
**-వాట్సాప్, టెలిగ్రామ్, ఆఫ్‌లైన్ తరగతుల ద్వారా విద్యార్థులకు చేరవేత**




**న్యూఢిల్లీ, ఆగస్టు 7: నవ సంఘర్షణ**
నీట్ యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వ్యవహారానికి సంబంధించి శుక్రవారం సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్ ద్వారా పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పరీక్షకు మూడు రోజుల ముందే వాట్సాప్, టెలిగ్రామ్, ఆఫ్‌లైన్ తరగతుల ద్వారా విద్యార్థులకు అవి అందాయని సీబీఐ పేర్కొంది. మొత్తం వ్యవహారంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)కు చెందిన సబ్జెక్ట్ నిపుణులు, కోచింగ్ సెంటర్ నిర్వాహకులు, మధ్యవర్తులు, ఇతర వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు సీబీఐ తన చార్జిషీట్‌లో పేర్కొంది. ప్రశ్నలను గుర్తు పెట్టుకోవడం, చీటీలపై రాసుకోవడం, పుస్తకాల్లో సంబంధిత పేరాలను మార్క్ చేయడం వంటి పద్ధతులను నిందితులు అనుసరించారని వెల్లడించింది.
రసాయన శాస్త్ర నిపుణుడు పీవీ కులకర్ణి గోప్యతా ప్రమాణం చేసినప్పటికీ ఈ ఏడాది ఏప్రిల్ 25, 27 మధ్య పుణెలో ప్రత్యేక తరగతులు నిర్వహించారని దర్యాప్తు సంస్థ తెలిపింది. ఈ తరగతులకు హాజరైన విద్యార్థులకు తదనంతరం నీట్ పరీక్షలో వచ్చిన ప్రశ్నలు, సమాధానాలనే డిక్టేట్ చేసి చెప్పారని పేర్కొంది. లాతూర్‌లోని విద్యార్థులకు కూడా ఇలాంటి ప్రత్యేక తరగతులనే నిర్వహించినట్లు సీబీఐ తెలిపింది. విద్యార్థుల నోట్‌బుక్స్‌లోని ప్రశ్నలు, లీక్ అయిన ప్రశ్నపత్రంతో సరిపోలుతున్నాయని, కులకర్ణి మొబైల్ ఫోన్ నుండి కెమిస్ట్రీ ప్రశ్నల ఫొటోలు, అభ్యర్థులు, వారి తల్లిదండ్రులతో జరిపిన సంభాషణలు, అలాగే ఇతర కీలకమైన డిజిటల్ ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు కూడా సీబీఐ పేర్కొంది. భౌతిక శాస్త్ర విషయ నిపుణురాలైన మనీషా హల్దార్ రూ. 25,000 తీసుకుని భౌతిక శాస్త్ర ప్రశ్నలను బయటకు వెల్లడించినట్లు సీబీఐ ఆరోపించింది.
పరీక్షకు 8 రోజుల ముందే ఆమె మొబైల్ ఫోన్‌లో చేతిరాతతో ఉన్న ప్రశ్నలు ఉన్నట్లు విచారణలో తేలింది. ఆ ప్రశ్నలను ఆమె మరో నిందితుడైన తేజస్ షాకు చదివి వినిపించారు. వాటిని ఇతరులకు చేరవేసే బాధ్యత తేజస్ షాదేనని సీబీఐ పేర్కొంది. ఈ నెట్‌వర్క్‌లో విద్యార్థులకు, సబ్జెక్ట్ నిపుణులకు మధ్య మనీషా వాఘ్మరే ఒక వారధిలా వ్యవహరించారని చార్జిషీట్ పేర్కొంది. విద్యార్థులను ఆఫ్‌లైన్ తరగతులకు పంపేందుకు వారు తల్లిదండ్రుల నుండి రూ.4 లక్షల వరకు వసూలు చేసి ఆ నిధులను సేకరించేవారని సీబీఐ తెలిపింది. పరీక్షలో ఆ నిర్దిష్ట ప్రశ్నలే వస్తే అదనంగా మరో రూ.50 వేలను డిమాండ్ చేశారని సీబీఐ ఆరోపించింది. ఇక మనీషా గురునాథ్ తన ఇంట్లోనే బయాలజీ తరగతులు నిర్వహించినట్లు సీబీఐ గుర్తించింది. ఆమె విద్యార్థుల చేత కొత్త ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల్లోని నిర్దిష్ట పేరాలను గుర్తించేలా చేసి ప్రశ్నలను రాసుకోమని చెప్పారు. ఆ తర్వాత లీక్ అయిన ఫిజిక్స్ ప్రశ్నల ప్రతులను కూడా ఆమె సేకరించారని సీబీఐ పేర్కొంది.

**ఎన్‌టీఏ లోపాలే లీక్‌కు కారణం**

ఈ ఏడాది నీట్-యూజీ ప్రశ్నపత్రాల లీకేజ్‌కు గల కారణాలను విశ్లేషించిన సీబీఐ కొన్ని ప్రధాన లోపాలను గుర్తించింది. వీటిలో ఒకటి కంటే ఎక్కువ ప్రక్రియలలో పాల్గొనే విషయ నిపుణులకు అవసరానికి మించిన అనుమతి ఉండటం, అలాగే ప్రధాన కార్యాలయంలో పనివేళల్లో వారిపై నిఘా ఉంచడానికి ఎటువంటి నిఘా కెమెరా వ్యవస్థ లేకపోవడం వంటివి ఉన్నాయి. నిఘా దృశ్యాల బ్యాకప్ గరిష్ఠంగా 25 రోజులకు మాత్రమే పరిమితమై ఉండటాన్ని కూడా ఆ సంస్థ గుర్తించింది. దీనివల్ల ఒక కీలక భాగం అందుబాటులో లేకుండా పోయింది. పరీక్ష రోజున సికార్‌కు చెందిన ఒక ఉపాధ్యాయుడు ఈమెయిల్ ద్వారా పంపిన ప్రశ్నపత్రం లీక్ సమాచారంపై స్పందించడానికి ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ ఐదు రోజుల సమయం తీసుకున్నారని సీబీఐ వెల్లడించింది. దేశవ్యాప్తంగా 22 లక్షల మందికి పైగా అభ్యర్థులు రాసిన పరీక్షలోని అసలు ప్రశ్న పత్రాలతో సరిపోలే ప్రశ్నలను కలిగి ఉన్న ఒక గెస్ పేపర్ గురించి ఆ ఉపాధ్యాయుడికి ఆయన ఇంటి యజమాని సమాచారం అందించారు. దీనిపై ఎన్‌టీఏ అధిపతి మే1 మాత్రమే స్పందించారు. సీబీఐ దాఖలు చేసిన 94 పేజీల చార్జిషీట్‌లో ఎన్‌టీఏకు చెందిన సబ్జెక్ట్ నిపుణులకు ఈ ప్రక్రియలోని ఒకటి కంటే ఎక్కువ దశలకు యాక్సెస్(అనుమతి) ఉండేదని సీబీఐ పేర్కొంది. దీనివల్ల వారు ప్రశ్నల పూర్తి సెట్‌ను చూడగలిగేవారని, వాటిని లీక్ చేసే అవకాశం వారికి లభించిందని సీబీఐ తన చార్జిషీట్‌లో తెలిపింది. ఎన్‌టీఏ ప్యానల్‌లో సంబంధిత సబ్జెక్ట్ నిపుణులుగా ఉన్న పీవీ కులకర్ణి, మనీషా సంజయ్ హవల్దార్, మనీషా మందారేలతో సహా మొత్తం 13 మంది నిందితులను సీబీఐ అరెస్టు చేసి వారిపై అభియోగాలు మోపింది.

# ఏఐతో కొత్త వైరస్‌ల సృష్టి!

**-బ్యాక్టీరియాను చంపేందుకే అంటున్న స్టాన్‌ఫోర్డ్ శాస్త్రవేత్తలు**
**-జీవాయుధాలను సృష్టించే ప్రమాదమున్నదని ఆందోళన**



**కాలిఫోర్నియా: , ఆగస్టు 7: నవ సంఘర్షణ**
శాస్త్రవేత్తలు కృత్రిమ మేధస్సు(ఏఐ) ఉపయోగించి కొత్త వైరస్‌లను రూపొందించారు. వాటిలో 16 వైరస్‌లు బ్యాక్టీరియాను పూర్తిగా నాశనం చేయగల క్రియాశీలక క్రిములుగా మారాయి. కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం, ఆర్క్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన బృందం సైన్స్ జర్నల్‌లో ఈ పరిశోధన ప్రచురితమైంది. ఈ వైరస్‌లు కేవలం బ్యాక్టీరియాపై మాత్రమే దాడి చేస్తాయి. ఇవి మనుషులకు, జంతువులకు లేదా మొక్కలకు సంక్రమించలేవు.
సూపర్ బగ్స్‌కు వ్యతిరేకంగా కొత్త ఆయుధాన్ని ఏఐ అందించగలదని ఈ అధ్యయనంతో స్పష్టమవుతున్నది. అదేసమయంలో ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే డీఎన్ఏ డాటాపై శిక్షణ పొందిన సాఫ్ట్‌వేర్ ఇప్పుడు మొదటి నుంచి పనిచేసే ఒక వైరస్‌ను సృష్టించగలదని నిరూపితమైంది. జాన్స్ హాప్‌కిన్స్‌కు చెందిన ఇద్దరు పరిశోధకులు థామస్ ఇంగిల్స్‌బై, మోరిట్జ్ హాంకే దీనిపై స్పందిస్తూ.. ఏఐతో వైరల్ జన్యువులను తయారు చేసే సామర్థ్యం ఇప్పుడు అందుబాటులోకి వచ్చిందని, కానీ దానిని నియంత్రించే నియమాలు మాత్రం లేవని స్పష్టం చేశారు.

ఏఐ డీఎన్ఏను ఎలా రాస్తుంది?

ఈవో 1, ఈవో 2 అని పిలిచే ఈ మోడళ్లు చాట్‌జీపీటీ తరహాలోనే పనిచేస్తాయి. చాట్‌జీపీటీ తర్వాత పదం ఏమిటో అంచనా వేస్తుంది. ఈవో అనేది డీఎన్ఏ వరుసలో తర్వాత ఏ రసాయన అక్షరం వస్తుందో అంచనా వేస్తుంది. దానికి సరిపడా జన్యు కోడ్‌ను అందిస్తే, చాట్‌బాట్ ఇంగ్లిష్ భాషను అర్థం చేసుకున్నట్టే ఇది కూడా జీవ నిర్మాణాత్మక వ్యాకరణాన్ని పట్టుకోవడం ప్రారంభిస్తుంది. స్టాన్‌ఫోర్డ్‌కు చెందిన బ్రియాన్ హై నేతృత్వంలోని బృందం దీనికి మిలియన్ల కొద్దీ సహజ జన్యువులపై శిక్షణ ఇచ్చింది. తర్వాత బాగా అధ్యయనం చేసి 'ఎక్స్174' దాని అనుబంధ వైరస్‌లపై దృష్టి పెట్టింది. ఈవో వందల, వేల సాధ్యమయ్యే కొత్త డిజైన్లను రూపొందించింది. పరిశోధకులు వాటిలో దాదాపు 300 డిజైన్లను ఎంచుకుని, ఆ డీఎన్ఏను ల్యాబ్‌లో భౌతికంగా తయారు చేసి బ్యాక్టీరియాలోకి ప్రవేశపెట్టారు. ఏఐ రూపొందించిన వైరస్‌లు సజీవంగా ఉన్నాయని గ్రాడ్యుయేట్ విద్యార్థి శామ్యూల్ కింగ్ గుర్తించారు. పెట్రీ డిష్‌పై పెరిగే బ్యాక్టీరియా మసకగా ఉండే పొరలా ఏర్పడుతుంది. ఏదైనా వైరస్ ఆ బ్యాక్టీరియాను తిని నాశనం చేస్తున్నప్పుడు అక్కడ స్పష్టమైన ఖాళీ చుక్కలు కనిపిస్తాయి. శామ్యూల్ కింగ్‌కు ఒకరోజు ఉదయాన్నే పెట్రీ డిష్‌పై అలాంటి చుక్కలు కనిపించాయి. మనుగడ సాగించిన 16 వైరస్‌లు బలహీనమైనవి కావు. వాటికి నమూనాగా తీసుకున్న సహజ వైరస్ కంటే కొన్ని వేగంగా వృద్ధి చెందాయి. సహజ వైరస్‌ను తట్టుకునే శక్తిని ఇప్పటికే పెంచుకున్న ఈ.కోలి బ్యాక్టీరియాను కూడా ఏఐ రూపొందించిన ఈ వైరస్‌ల మిశ్రమం పూర్తిగా నాశనం చేసింది. ప్రకృతి నుంచి సేకరించిన వైరస్‌ల మిశ్రమం ఆ పని చేయలేకపోయింది. ఏఐ అదుపు తప్పకుండా ఉండడానికి పరిశోధకులు ఎలాంటి ప్రమాదకరమైన డాటాను శిక్షణ కోసం ఉపయోగించలేదు. మనుషులు, జంతువులు, మొక్కలు లేదా శిలింధ్రాలకు సోకే వైరస్‌లను మోడల్ డాటాలో చేర్చలేదు. ఈ జాగ్రత్తలను హాంకే మెచ్చుకున్నారు. అయితే ఈ బృందం అనుసరించడానికి ఎటువంటి అధికారిక నియమావళి లేదని ఆయన గుర్తుచేశారు.

ప్రభుత్వ నియంత్రణలు ఆపగలవా?

కొత్త యూఎస్ ఆరోగ్య విధానం జీవ కారకాలను మరింత ప్రమాదకరంగా మార్చడాన్ని నిషేధించింది. అయితే ఇది కంప్యూటర్‌పై చేసే పనులకు వర్తించదు. అంతేకాకుండా ఈవో 2 అనేది ఒక ఓపెన్ సోర్స్. ఇది ఎవరైనా ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇది చాలామందిని ఆందోళనకు గుర్తిచేస్తున్నది. అయితే భయపడాల్సిన అవసరం లేదని కొందరు అంటున్నారు. లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీకి చెందిన టామ్ ఎల్లిస్ మాట్లాడుతూ.. ఇది ఎవరైనా ప్రయత్నించగల అత్యంత చిన్న, సులువైన జన్యువు అని పేర్కొన్నారు. 'ఈ వైరస్‌కు దాదాపు 5,400 అక్షరాల కోడ్ అవసరం. కానీ ఒక సాధారణ సజీవ కణానికి 5,00,000 అక్షరాలు కావాలి. దీనికంటే పెద్దవాటిని తయారుచేయడం చాలా కష్టమైన పని, కానీ అసాధ్యం అయితే కాదు ' అని టామ్ ఎల్లిస్ వ్యాఖ్యానించారు.

# ఆయుధాల కొరతతో ట్రంప్ ఆగ్రహం

**-క్షిపణి నిల్వలు తగ్గుతున్నాయన్న కథనాలపై తీవ్ర అసంతృప్తి**
**-ఇరాన్‌తో కీలక చర్చల సమయంలో ఇలా జరగడంపై అసహనం**
**-లీకులపై విచారణకు ఆదేశాలు**



**వాషింగ్టన్ , ఆగస్టు 7: నవ సంఘర్షణ**
ఇరాన్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో అమెరికా ఆయుధ నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయన్న మీడియా కథనాలు అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌నకు తీవ్ర అసహనాన్ని కలిగించాయి. ఈ సమాచారం బయటకు రావడంతో అమెరికా బలహీనంగా కనిపిస్తోందనీ, అది ఇరాన్‌తో జరుగుతున్న చర్చల్లో తమ బేరసారాల శక్తిని దెబ్బతీస్తోందని ట్రంప్ ఆందోళన వ్యక్తం చేసినట్టు అమెరికా ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ సమాచారాన్ని లీక్ చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన న్యాయశాఖను ఆదేశించారు. అమెరికా మీడియా కథనాల ప్రకారం... ఇటీవల క్యాంప్ డేవిడ్‌లో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ అంశం ప్రధాన చర్చగా మారింది. క్షిపణుల నిల్వలు తగ్గుతున్నాయన్న వార్తలపై ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమావేశానికి హాజరైన అధికారులు తెలిపారు. ఆయుధ నిల్వల పరిస్థితి గురించి తనకు ముందే తెలుసనీ, అయితే ఈ సమాచారం ఇరాన్‌తో చర్చలు కీలక దశకు చేరుకున్న సమయంలో బయటకు రావడమే తన ఆగ్రహానికి కారణమని ట్రంప్ పేర్కొన్నట్టు వెల్లడించారు. ఈ కథనాలపై ట్రంప్ సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో స్పందిస్తూ... అమెరికా వద్ద భారీ స్థాయిలో ఆయుధ నిల్వలు ఉన్నాయనీ, అవసరమైన ఆయుధాలను పెద్ద ఎత్తున తయారు చేస్తున్నామని వివరించడం గమనార్హం. దేశ చరిత్రలో ఎన్నడూ లేనంతగా రక్షణ పరిశ్రమలో కొత్త కర్మాగారాలు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. అయితే కొన్ని అత్యాధునిక క్షిపణుల నిల్వలు మాత్రం పరిమితంగానే ఉన్నాయని అనంతరం వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడిన సందర్భంగా ట్రంప్ అంగీకరించారు. అదే సమయంలో సాధారణ ఆయుధాలకు మాత్రం కొరత లేదని స్పష్టం చేశారు. ఈ సమాచారాన్ని బయటకు వెల్లడించిన వారిపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రహస్యాలను బయటపెట్టిన వారిపై దీర్ఘకాల జైలు శిక్షలు విధించాలని కోరుతూ.. వారిని "దేశద్రోహులు"గా అభివర్ణించారు. ఈ లీకుల వెనుక ఉన్న అధికారులను గుర్తించే బాధ్యతను న్యాయశాఖకు అప్పగించినట్టు వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి. అయితే ఈ వ్యవహారంలో రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్‌సెత్‌ను ట్రంప్ నిందించలేదని అధికారులు స్పష్టం చేశారు. ఆయన పనితీరుపై తాను పూర్తిగా సంతృప్తిగా ఉన్నానని ట్రంప్ మరో పోస్టులో పేర్కొన్నారు. సమస్య మొత్తం సమాచార లీకుల గురించేనని వైట్‌హౌస్ అధికారులు వెల్లడించారు.

# బిజినెస్

## కేకేఆర్ చేతికి మెడికవర్




**న్యూఢిల్లీ,**
అంతర్జాతీయ పెట్టుబడుల సంస్థ కేకేఆర్ చేతికి మరో హాస్పిటల్ చేరింది. హైదరాబాద్ కేం ద్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న మెడికవర్ ఇండియా యూనిట్‌ను హస్తగతం చేసుకోబోతున్నది. ఒప్పం దం విలువ మాత్రం కేకేఆర్ వెల్లడించలేదు.

ప్రస్తుతం మెడికవర్ ఇండియా విలువ 1.2 బిలియన్ల యూరోలు. 2017లో ప్రారంభమైన మెడికవర్ హాస్పిటల్.. దేశవ్యాప్తంగా 24 దవాఖానల్లో 4,800 పడకలను నిర్వహిస్తున్నది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఈ పెట్టుబడులు పెట్టినట్టు, దీంతో మెడికవర్ ఇండియా డాక్టర్లు, ఉద్యోగులకు మరింత లాభదాయకంగా ఉంటుందని కేకేఆర్ ఇండియా హెడ్ అక్షయ్ తన్నా తెలిపా రు. మెడికవర్ ఇండియాలో 80 క్లినికల్ స్పెషాల్టీలు, 1,900 మంది డాక్టర్లు, అడ్వాన్స్‌డ్ క్లినికల్ మౌలిక సదుపాయాల టెక్నాలజీ ఉన్నది. దేశీయ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థకు దీర్ఘకాలిక అభివృద్ధిపై తమకున్న నమ్మకానికి ఈ పెట్టుబడులు నిదర్శనమన్నారు

# ఎస్‌బీఐకి బంపర్ లాభాలు

**క్యూ1లో రూ.21,121 కోట్లు**
**ఎన్ఐఐ 15 శాతం వృద్ధి**
**తగ్గిన మొండి బాకీలు**

ప్రభుత్వ రంగంలోని బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026-27 జూన్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ1)లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) పెరుగుదలతో బ్యాంకు నికర లాభం వార్షిక ప్రాతిపదికన 10.23 శాతం పెరిగి రూ.21,121 కోట్లకు చేరింది. గతేడాది ఇదే కాలంలో ఈ లాభం రూ.19,160 కోట్లుగా నమోదయ్యింది. క్రితం క్యూ1లో నిర్వహణ లాభం 9.77 శాతం పెరిగి రూ.33,529 కోట్లకు చేరడం బ్యాంక్ ప్రగతికి ప్రధాన మద్దతును అందించింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) ఏకంగా 14.88 శాతం పెరిగి రూ.46,992 కోట్లకు చేరింది. మొత్తం వడ్డీ ఆదాయం రూ.1,27,896 కోట్లుగా నమోదవగా, వడ్డీ వ్యయాలు రూ.80,904 కోట్లుగా ఉన్నాయి. అయితే ట్రెజరీ,




విదేశీ మారకద్రవ్య (ఫారెక్స్) ఆదాయాలు తగ్గడంతో నాన్-ఇంట్రెస్ట్ ఆదాయం 9.07 శాతం క్షీణించి రూ.15,923 కోట్లకు చేరింది. ఫారెక్స్, డెరివేటివ్స్ ఆదాయం 69.57 శాతం తగ్గగా, పెట్టుబడుల విక్రయాల లాభం కూడా రూ.6,326 కోట్ల నుంచి రూ.4,319 కోట్లకు తగ్గింది. మరోవైపు రుణాల ప్రాసెసింగ్ ఫీజులు, ప్రభుత్వ వ్యాపార కమిషన్లు పెరగడంతో ఫీజు ఆధారిత ఆదాయం 20.83 శాతం పెరిగి రూ.9,476 కోట్లకు చేరింది. మొండి బాకీలను కట్టడి చేయడంలో ఎస్‌బిఐ మరింత మెరుగ్గా వ్యవహరించింది. జూన్ 2026 చివరి నాటికి స్థూల నిరర్థక ఆస్తుల (జిఎన్‌పిఎ) నిష్పత్తి 1.83 శాతం నుంచి 1.47 శాతానికి పరిమితం కాగా.. నికర నిరర్థక ఆస్తుల (ఎన్ఎన్‌పిఎ) నిష్పత్తి 0.47 శాతం నుంచి 0.38 శాతానికి పడిపోయింది. రుణాల వ్యయం 0.47 శాతం నుంచి 0.27 శాతానికి తగ్గడం, స్లిప్పేజ్ నిష్పత్తి 0.75 శాతం నుంచి 0.57 శాతానికి తగ్గడం కూడా ఆస్తుల నాణ్యత మెరుగుదలను ప్రతిబింబించాయి.

# ప్రీకాన్ ఏఐ నిర్మాణ వేదిక లోగో ఆవిష్కరణ

**న్యూఢిల్లీ :**
మధ్యప్రాచ్య నిర్మాణ రంగంలో కృత్రిమ మేధ (ఎఐ) వినియోగాన్ని విస్తరించే లక్ష్యంతో కెనడా--భారత్ నిపుణులు అభివృద్ధి చేసిన 'ప్రీకాన్' ఏఐ ఆధారిత నిర్మాణ సాంకేతిక వేదిక లోగోను దుబాయ్‌లో భారత కాన్సుల్ జనరల్ డా. ఈ. విష్ణువర్ధన్ రెడ్డి ఆవిష్కరించారు. నిర్మాణ ప్రాజెక్టుల ప్రణాళిక, వ్యయ అంచనాలు, టెండర్ విశ్లేషణను వేగవంతం చేసే ఈ ప్లాట్‌ఫామ్‌ను శ్రీధర్ గొనెపల్లి (సన్నీ), ఉమా మహేష్ ముక్కరా రూపొందించగా, యూఏఈ మార్కెట్ ప్రవేశానికి సందీప్ మక్తాల వ్యూహాత్మక సమన్వయం అందించారు. ఈ సందర్భంగా భారత్--కెనడా--యుఎఇల మధ్య సాంకేతిక భాగస్వామ్యం మరింత బలోపేతం కావడం అభినందనీయమని డా. ఈ. విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. జీసీసీ దేశాల్లో విస్తరణలో భాగంగా రాస్ అల్ ఖైమా ప్రభుత్వం, షార్జా రీసెర్చ్




అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ పార్క్ (ఎస్ఆర్‌టిఐపి) అధికారులతో జరిపిన చర్చలు సానుకూలంగా ముగిశాయని, నిర్మాణ రంగాన్ని ఏఐతో మరింత సమర్థవంతంగా మార్చే ప్రపంచ స్థాయి పరిష్కారాలను అందించడమే లక్ష్యమని సహ వ్యవస్థాపకుడు శ్రీధర్ గొనెపల్లి తెలిపారు.

# వామప్ మ్యాచ్‌లో తేలిపోయిన భారత బౌలర్లు!

శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు సన్నాహకంగా సాగుతున్న వామప్ మ్యాచ్‌లో భారత బౌలర్లు తేలిపోయారు. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న వికెట్‌పై శ్రీలంక ఎలెవన్ బ్యాటర్లు అద్భుతమైన బ్యాటింగ్‌తో భారీ స్కోర్ నమోదు చేశారు. ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక ఎలెవన్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్లకు 363 పరుగులు చేసింది. నిషాన్ ఫెర్నాండో(65 బంతుల్లో 11 ఫోర్లు, సిక్స్‌తో 66), రావిందు రసంతా(143 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 71), కెప్టెన్ సోనాల్ దినుషా(72 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 52) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా(2/64), కుల్దీప్ యాదవ్(2/76), మానవ్ సుతార్(2/33) రెండేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, యువ బౌలర్ సరాన్ష్ జైన్ ఒక్క వికెట్ తీయలేకపోయారు. జస్‌ప్రీత్ బుమ్రా స్థానంలో జట్టులోకి వచ్చిన అకిబ్ నబీకి బౌలింగ్ చేసే అవకాశం ఇవ్వలేదు. భారత పేలవ ఫీల్డింగ్ కూడా శ్రీలంక బ్యాటర్లకు కలిసొచ్చింది. పలు క్యాచ్ డ్రాప్‌లతో శ్రీలంక బ్యాటర్లు ఔటయ్యే ప్రమాదం నుంచి




తప్పించుకున్నారు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక బ్యాటర్లను భారత బౌలర్లు ఇబ్బంది పెట్టలేకపోయారు. పూర్తిగా గ్రీనీష్ వికెట్‌పై సిరాజ్, ప్రసిధ్ కృష్ణ ప్రభావం చూపలేకపోయారు. దాంతో తొలి సెషన్‌లో శ్రీలంక బ్యాటర్లు పూర్తి ఆధిపత్యం చెలాయించారు. వన్డే తరహా బ్యాటింగ్‌తో చెలరేగిన ఓపెనర్ నిషాన్ ఫెర్నాండో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. సెంచరీ దిశగా సాగిన అతన్ని కేఎల్ రాహుల్ రనౌట్ చేశాడు. దాంతో తొలి వికెట్‌కు నమోదైన 110 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. తొలి సెషన్ ముగిసేసరికి శ్రీలంక ఎలెవన్ వికెట్ నష్టానికి 138 పరుగులు చేసింది. రెండో సెషన్‌లోనూ శ్రీలంక బ్యాటర్లు చెలరేగారు. రావిందు రసంతా(71) హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. పాసిందు సూరియాబండార రెండో వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. అతన్ని జడేజా క్లీన్ బౌల్డ్ చేశాడు. సెంచరీ దిశగా సాగిన రావిందు రసంతాను మానవ్ సుతార్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. పవన్ రత్నాయకే(39)ను గుర్నూర్ బ్రార్ ఔట్ చేయడంతో శ్రీలంక 246/4తో రెండో సెషన్‌ను ముగించింది. ఈ సెషన్‌లో ఇరు జట్లు సమంగా నిలిచాయి. మూడో సెషన్‌లో భారత స్పిన్నర్లు చెలరేగారు. కెప్టెన్ సోనాల్ దినుషా(52) హాఫ్ సెంచరీతో రాణించినా.. మిగతా బ్యాటర్లను పెవిలియన్‌కు చేర్చారు. అహన్ విక్రమసింఘే(31), అంజాలా బండార(13)ను కుల్దీప్ యాదవ్ ఔట్ చేయగా.. రమేష్ మెండీస్(32)ను జడేజా క్యాచ్ ఔట్ చేశాడు. సోనాల్ దినుషాను మానవ్ సుతార్ ఔట్ చేయగా.. దిలుమ్ సుదీర, కేశర నువాంత మరో వికెట్ పడకుండా తొలి రోజు ఆటను ముగించారు.

# స్పోర్ట్స్

## ముంబై ఇండియన్స్‌కు సూర్యకుమార్ గుడ్ బై!



ముంబై ఇండియన్స్ స్టార్ ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్ ఆ జట్టు వీడేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందే అతను జట్టు నుంచి తప్పుకోనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే ఆ జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యా.. టీమ్‌లో కొనసాగలేనని సమాచారమిచ్చినట్లు వార్తలు వచ్చాయి. హార్దిక్ పాండ్యాను ఇతర జట్టుకు ట్రేడింగ్ చేసి తమకు కావాల్సిన ఆటగాళ్లను తీసుకోవాలనే యోచనలో ముంబై ఇండియన్స్ ఉంది. ఇప్పటికే సీఎస్‌కే, కేకేఆర్, సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్‌తో హార్దిక్ పాండ్యా ట్రేడ్ డీల్‌కు సంబంధించి ముంబై ఇండియన్స్ సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే హార్దిక్ పాండ్యా ట్రేడ్ డీల్ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇది ఇలా ఉండగానే సూర్యకుమార్ యాదవ్ ట్రేడ్ డీల్ వార్తలు కూడా తెరపైకి వచ్చాయి. ముంబై ఇండియన్స్ జట్టులో కొనసాగేందుకు సూర్యకుమార్ యాదవ్ సుముఖంగా లేడని, అతన్ని లక్నో సూపర్ జెయింట్స్‌కు ట్రేడ్ చేసేందుకు ప్రయత్నాలు జరిగాయని తెలుస్తోంది. అయితే లక్నో జట్టులో చేరేందుకు సూర్య విముఖత చూపినట్లు సమాచారం. ముంబై ఇండియన్స్ నుంచి అతని నిష్క్రమణ ఖాయమైనప్పటికీ.. అతను ఏ జట్టులో చేరుతాడనేది ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ పేలవ ప్రదర్శన కనబర్చింది. 14 మ్యాచ్‌ల్లో పదింటిలో ఓడి పాయింట్స్ టేబుల్‌లో 9వ స్థానంలో నిలిచింది. సూర్యకుమార్ యాదవ్ తీవ్రంగా నిరాశపర్చాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో 16 మ్యాచ్‌ల్లో 717 పరుగులు చేసిన సూర్య.. 2026 సీజన్‌లో మాత్రం 13 మ్యాచ్‌ల్లో 2 హాఫ్ సెంచరీలతో 270 పరుగులే చేశాడు. అతని పేలవ ఫామ్ ముంబై విజయవకాశాలను దెబ్బతీసింది. ఈ నేపథ్యంలోనే సూర్యతో పాటు పలువురు కీలక ఆటగాళ్లను తొలగించాలని ముంబై మేనేజ్‌మెంట్ నిర్ణయించింది. హార్దిక్ పాండ్యాను కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ట్రేడ్ చేసేందుకు చర్చలు జరుగుతుండగా.. సూర్య ట్రేడ్ డీల్‌పై క్లారిటీ లేదు. అయితే సూర్య నిష్క్రమణపై ముంబై ఇండియన్స్ అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. పేలవ బ్యాటింగ్ ప్రదర్శనతో సూర్య.. టీమిండియా టీ20 కెప్టెన్సీతో పాటు జట్టులో కూడా చోటు కోల్పోయాడు.

# సన్‌రైజర్స్ ఆటగాళ్లపై ముంబై ఇండియన్స్ కన్ను!

ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ అంచనాలను అందుకోలేకపోయింది. టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ 14 మ్యాచ్‌ల్లో పదింటిలో ఓడి తీవ్రంగా నిరాశపర్చింది. దాంతో పాయింట్స్ టేబుల్‌లో 9వ స్థానంతో సరిపెట్టుకుంది. ఐదు సార్లు ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్‌కు ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యమైన ప్రదర్శన కాదు. జట్టు నిండా స్టార్లు ఉన్నా అంచనాలకు తగ్గట్లు రాణించలేకపోయింది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్ వైఫల్యం ముంబై పతనాన్ని శాసించింది. ఈ ఘోర పరాజయాన్ని సీరియస్‌గా తీసుకున్న ముంబై ఇండియన్స్.. వచ్చే సీజన్‌లో టైటిల్ గెలవడమే లక్ష్యంగా జట్టును సిద్ధం చేస్తోంది. జట్టును వీడాలని నిర్ణయించుకున్న కెప్టెన్ హార్దిక్ పాండ్యాను అడ్డు పెట్టుకొని తమకు కావాల్సిన ఆటగాళ్లను ఇతర జట్ల నుంచి ట్రేడ్ చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు చెందిన ఇషాన్ కిషన్, శివాంగ్ కుమార్ లేదా దేశీయ పేసర్, ఒక ఓవర్‌సీస్ పేసర్‌ను జట్టులోకి తెచ్చుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఈ ట్రేడ్ డీల్ గురించి తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా చెప్పడం తీవ్ర




చర్చనీయాంశమైంది. 'సీఎస్‌కే, కేకేఆర్ కాకుండా ముంబై ఇండియన్స్ ఇతర జట్ల వైపు కూడా చూడవచ్చుహార్దిక్ పాండ్యాకు బదులుగా ఒక భారతీయ బ్యాటర్, ఒక విదేశీ/భారతీయ బౌలర్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ముంబై డీల్‌కు ప్రయత్నించవచ్చు. గతంలో ముంబై ఆటగాడిగా ఉన్నఇషాన్ కిషన్‌ను హార్దిక్ పాండ్యాకు బదులుగా వారు అడగవచ్చు. ఇషాన్ కిషన్, శివాంగ్ కుమార్ లాంటి ఆటగాడు వస్తే హార్దిక్ పాండ్యాకు సమాన విలువ లభిస్తుంది.'అని అశ్విన్ పేర్కొన్నాడు. అయితే అశ్విన్ చెప్పిన మాటలు వాస్తవమేనని పలువురు క్రికెట్ పండిట్స్ అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ముంబై ఇండియన్స్‌కు ఇషాన్ కిషన్ వంటి ఇండియన్ టాపార్డర్ బ్యాటర్ అవసరం ఉంది. అలాగే శివాంగ్ కుమార్ వంటి స్పిన్నర్‌తో పాటు ఓవర్‌సీస్ పేసర్, ఇండియన్ పేసర్ కూడా కావాలి. హార్దిక్ పాండ్యాను అడ్డు పెట్టి తమకు కావాల్సిన ఆటగాళ్ల కోసం ముంబై.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో సంప్రదింపులు జరపవచ్చు. అంతేకాకుండా ఇషాన్ కిషన్ గతంలో ముంబై ఇండియన్స్‌కు మెరుగ్గా ఆడాడు. ప్రస్తుతం అతను సూపర్ ఫామ్‌లో ఉండటమే కాకుండా ఇండియన్ ఐకాన్ ప్లేయర్‌గా ఎదుగుతున్నాడు. కాబట్టి అతని కోసం ముంబై గట్టిగా ప్రయత్నించే అవకాశం ఉంది. అయితే ఈ డీల్‌కు కావ్యమారన్ నేతృత్వంలోని సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్ అంగీకరించపోవచ్చని ఆ జట్టు ఫ్యాన్స్ అంటున్నాడు. నితీష్ రెడ్డి రూపంలో జట్టులో మంచి పేస్ ఆల్‌రౌండర్ ఉన్నాడని, హార్దిక్ పాండ్యా కోసం ఇషాన్ కిషన్ వంటి కీలక బ్యాటర్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ వదులుకోదని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

TGTEL/26/A4846
నవ సంఘర్షణ
తెలుగు దినపత్రిక
www.navasangharshana.com



# సూర్య 'విశ్వనాథ్ అండ్ సన్స్' ట్రైలర్ వచ్చేసింది..

## ఆగస్టు 14న గ్రాండ్ రిలీజ్!




కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్'. టాలెంటెడ్ డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత నాగవంశీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలు ఉండగా, తాజాగా మేకర్స్ ఈ మూవీ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో సూర్య సరసన మలయాళ బ్యూటీ మమిత బైజు కథానాయకిగా నటిస్తోంది. ట్రైలర్ చూస్తుంటే ఇదొక డిఫరెంట్ లవ్ స్టోరీ మరియు ఫ్యామిలీ ఎమోషన్స్‌తో కూడిన ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కినట్లు స్పష్టమవుతోంది. ఈ చిత్రంలో సూర్య మాజీ ఒలింపిక్ షూటర్ పాత్రలో నటిస్తుండగా, ఆయన పాత్ర చుట్టూ తిరిగే భావోద్వేగాలు సినిమాకి హైలైట్ నిలవనున్నాయి. రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్ వంటి ప్రముఖ తారలు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 14, 2026 న ఘనంగా థియేటర్లలో విడుదల కానుంది.



సెగలు పుట్టించిన యాంకర్ విష్ణు ప్రియ..

# టాలీవుడ్‌లో రితికా నాయక్ హవా..

## -'కొరియన్ కనకరాజు' విజయంతో పెరిగిన క్రేజ్!



టాలీవుడ్ యంగ్ అండ్ బ్యూటీఫుల్ హీరోయిన్ రితికా నాయక్ ప్రస్తుతం టాలీవుడ్ చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌తో థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. ఈ చిత్రంలో చైత్ర అనే మోడరన్ పాత్రలో కనిపించిన రితికా నాయక్ తన అద్భుతమైన అభినయంతో పాటు అందచందాలతో కుర్రకారును ఎంతగానో ఫిదా చేస్తున్నారు. తెరపై ఆమె లుక్స్, పెర్ఫార్మెన్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. అయితే కెరీర్ ప్రారంభం నుండి వరుస విజయాలను సొంతం చేసుకుంటూ వస్తున్న ఈ అమ్మడు, టాలీవుడ్‌లో తిరుగులేని 'గోల్డెన్ హ్యాండ్' లేదా 'లక్కీ ఛార్మ్' అనే ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. అశోక వనములో అర్జున కల్యాణం సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన రితికా నాయక్, ఆ తర్వాత వచ్చిన చిత్రాలతోనూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరచుకున్నారు. ఏ పాత్రనైనా తన సహజమైన నటనతో రక్తికట్టించగల నటిగా పేరు తెచ్చుకున్న ఈ బ్యూటీకి, ఇప్పుడు టాలీవుడ్‌లో వరుస అవకాశాలు క్యూ కడుతున్నాయి. సినిమాల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తూ, కథాబలమున్న పాత్రలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న రితికా నాయక్ భవిష్యత్తులో మరిన్ని క్రేజీ ప్రాజెక్ట్‌లతో టాలీవుడ్‌లో స్టార్



# హాలీవుడ్ రేంజ్‌లో అల్లు అర్జున్ 'రాకా' ..

## -ముంబైలోనే ఆ భారీ షెడ్యూల్!




అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'రాకా' షూటింగ్ ప్రస్తుతం ముంబై కేంద్రంగా శరవేగంగా జరుగుతోంది. హాలీవుడ్ రేంజ్ టెక్నికల్ వాల్యూస్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ ముంబైలోనే కొన్ని ప్రత్యేక సెట్లు వేసి కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఇటీవల కుటుంబంతో కలిసి వెకేషన్‌కు వెళ్ళొచ్చిన అల్లు అర్జున్, హైదరాబాద్‌లో అభిమానులను కలిసిన తర్వాత తిరిగి ముంబై సెట్స్‌లో జాయిన్ అయ్యారు. అయితే అసలు ప్లాన్ ప్రకారం ఈ చిత్రానికి సంబంధించి ఒక ముఖ్యమైన షెడ్యూల్ దుబాయ్‌లో జరగాల్సి ఉంది. కానీ ఇరాన్-యుద్ధం కారణంగా భద్రతా కారణాల రీత్యా దుబాయ్ షెడ్యూల్‌ను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. దీంతో దర్శకుడు అట్లీ ఏమాత్రం ఆలస్యం చేయకుండా, దుబాయ్‌లో జరగాల్సిన షూటింగ్‌ను కూడా ముంబైలోనే భారీ సెట్లు నిర్మించి పూర్తి చేస్తున్నారు. వేర్వేరు లొకేషన్ల చుట్టూ తిరగకుండా, ఒకే ప్రాంతంలో ప్రత్యేక సెట్లు వేసి షూటింగ్‌ను శరవేగంగా ముగిస్తున్నారు. ఇక ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొనే నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఆమె తన పాత్రకు సంబంధించిన షూటింగ్‌ను దాదాపుగా పూర్తి చేసుకున్నారు. దీపికా ప్రెగ్నెంట్ కావడంతో ఆమెకు సంబంధించిన పార్ట్‌ను అట్లీ ముందుగానే ప్లాన్ చేసి కంప్లీట్ చేశారు. మరోవైపు, ఈ సినిమా విజువల్ ఎఫెక్ట్స్  బాధ్యతలను ఒక ప్రముఖ హాలీవుడ్ స్టూడియో నిర్వహిస్తోంది. వారి సాంకేతిక అవసరాలకు తగినట్లుగా ముంబైలో ఒక భారీ సౌండ్ స్టేజ్‌ను కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ భారీ సెట్లు, హాలీవుడ్ టెక్నీషియన్ల భాగస్వామ్యం, నటుల భారీ రెమ్యునరేషన్ల కారణంగా 'రాకా' బడ్జెట్ ఊహించిన దానికంటే ఎక్కువే అవుతోందని బాలీవుడ్ మీడియా వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.

# వరుస ఫ్లాపుల తర్వాత శ్రీలీలకు బంపర్ ఆఫర్..

## -ఆ స్టార్ హీరో సరసన ఛాన్స్ దక్కిందా?

టాలీవుడ్‌లో ఒకప్పుడు వరుస అవకాశాలతో స్టార్ హీరోయిన్‌గా దూసుకెళ్లిన శ్రీలీల ఇప్పుడు కెరీర్‌లో కీలక దశను ఎదుర్కొంటోంది. 'పెళ్లి సందడి'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ అందాల భామ, 'ధమాకా' బ్లాక్‌బస్టర్ విజయంతో ఒక్కసారిగా స్టార్ హీరోయిన్ల జాబితాలో చేరింది. తన డ్యాన్స్, ఎనర్జీ, స్క్రీన్ ప్రెజెన్స్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ, ఆ తర్వాత నటించిన పలు చిత్రాలు ఆశించిన విజయాలు సాధించకపోవడంతో కెరీర్ కాస్త నెమ్మదించింది. వరుస పరాజయాల ప్రభావంతో తెలుగులో అవకాశాలు తగ్గిన నేపథ్యంలో, శ్రీలీల ఇప్పుడు ఇతర భాషలపై దృష్టి పెట్టింది. ఇప్పటికే బాలీవుడ్‌లో కార్తీక్ ఆర్యన్ సరసన ఓ భారీ చిత్రంలో నటించే అవకాశం దక్కించుకున్న ఈ భామకు తాజాగా కోలీవుడ్ నుంచి మరో ప్రతిష్టాత్మక ఆఫర్ వచ్చినట్లు సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. తమిళ సినీ వర్గాల సమాచారం ప్రకారం, సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించనున్న ఓ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో శ్రీలీలను కథానాయికగా ఎంపిక చేసే దిశగా చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రజనీకాంత్ వరుస భారీ చిత్రాలతో బిజీగా ఉండగా, ఆయన లైనప్‌లో ఉన్న ప్రాజెక్ట్‌లలో ఒకదానిలో శ్రీలీల నటించే అవకాశాలు ఉన్నాయని కోలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్ ఖరారైతే, శ్రీలీల కెరీర్‌లో ఇది అత్యంత కీలకమైన అవకాశంగా నిలవనుంది. వరుస ఫ్లాపుల తర్వాత కూడా రజనీకాంత్ వంటి లెజెండరీ స్టార్ సరసన నటించే అవకాశం రావడం ఆమెకు మరోసారి కెరీర్‌ను గాడిలో పెట్టే ఛాన్స్‌గా భావిస్తున్నారు. ఈ సినిమా విజయం సాధిస్తే, దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ శ్రీలీల క్రేజ్ మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక ప్రస్తుతం శ్రీలీల వ్యక్తిగతంగా కూడా బిజీగానే ఉంది. తన తల్లితో కలిసి పలు ప్రముఖ దేవాలయాలను సందర్శిస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటోంది. సినిమాలతో పాటు ప్రముఖ బ్రాండ్లకు సంబంధించిన వాణిజ్య ప్రకటనల్లో నటిస్తూ, తన స్కిన్‌కేర్ వ్యాపారాన్ని కూడా విజయవంతంగా నిర్వహిస్తోంది. సినిమాల విషయానికి వస్తే, తమిళంలో ఇప్పటికే 'పరాశక్తి'తో పాటు ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న మరో చిత్రంలో కూడా శ్రీలీల నటిస్తోంది. ఈ సినిమాలపై కూడా మంచి అంచనాలు ఉన్నాయి. ఇప్పుడు రజనీకాంత్ ప్రాజెక్ట్ వార్తలు నిజమైతే, శ్రీలీల కెరీర్‌కు ఇది భారీ టర్నింగ్ పాయింట్‌గా మారే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే, రజనీకాంత్ సినిమా విషయమై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో అభిమానులు అధికారిక ప్రకటన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.